PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 296 | విజయవాడ, సోమవారం 29 మే 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No Vijayawada, Monay 29 May 2023 Rs

భారాలు తగ్గిస్తేనే

రవాణా రంగానికి మనుగడ

- ఇంధన ధరలకు కళ్లెం వేయకుండా ఖర్చు తగ్గేదెలా?
- విడి భాగాల రేట్లు, పన్నులు, సెస్‌లు తగ్గించాల్సిందే

లోపలి పేజీలో..

మలేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

విజేత హెచ్ఎస్ ప్రణయ్

- తొలి బిడబ్ల్యుఎఫ్ టైటిల్ కైవసం

క్రీడలు పేజీలో

భవిష్యత్తుకు గ్యారెంటీ

- 6 పథకాలతో తొలిదశ మ్యానిఫెస్టో
- దసరా నాటికి పూర్తి ఎన్నికల ప్రణాళిక
- మహానాడు వేదికగా చంద్రబాబు శంఖారావం

ప్రజాశక్తి- ప్రత్యేక ప్రతినిధి (మహానాడు ప్రాంగణం రాజమహేంద్రవరం)

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మహానాడు వేదికగా తొలిదశ మ్యానిఫెస్టో ప్రకటించారు. ఇందులో ప్రధానంగా మహిళలకు ప్రాధాన్యత కల్పించారు. భవిష్యత్తుకు గ్యారంటీ పథకం కింద ఆరు పథకాలను వెల్లడించారు. మహానాడులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన వీటికి సంబంధించిన వివరాలు తెలియజేశారు. మహాశక్తి పథకం కింద నాలుగు పథకాలను ప్రకటించారు. ఇందులో ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. తల్లికి వందనం పథకం కింద చదువుకుంటున్న పిల్లల తల్లులకు రూ.15 వేలు ఇస్తామన్నారు. పిల్లలు ఎంతమంది ఉన్నా అందిస్తామని హామీ ఇచ్చారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. ప్రతి మహిళనూ మహాశక్తిగా మిగతా 2లో

మహానాడు, ఎన్‌టిఆర్ శతజయంతి సందర్భంగా రాజమండ్రిలో నిర్వహించిన బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన టిడిపి కార్యకర్తలు, ప్రసంగిస్తున్న చంద్రబాబు

ప్రధానమంత్రి అయిన నేను..

- నూతన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభిస్తూ మోడీ
- ప్రతిపక్ష పార్టీల నిరసనలు, బహిష్కరణలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష పార్టీల నిరసనలు, బహిష్కరణల మధ్య కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం మోడీ తన ప్రసంగాన్ని భారత దేశ ప్రజలమైన మేము అని సంబోధించడానికి బదులు భారత ప్రధాన మంత్రి అయిన నేను అని అన్నారు. దేశాధినేత అయిన రాష్ట్రపతిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించకుండా ప్రభుత్వం అగౌరవపరిచిందంటూ ప్రతిపక్షాలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఇదివరకే ప్రకటించాయి. ఈ ప్రారంభోత్సవానికి గాడ్సే గురువు విడి సావర్కర్ వర్ధంతి రోజును ఎంచుకోవడం, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా రాజదండాన్ని నూతన పార్లమెంటులో ప్రతిష్ఠించడంపై పెద్దయెత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ప్రధాని, మంత్రులు, స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధానుయోధుల సమక్షంలో నాటి పార్లమెంటు భవనం ప్రారంభం కాగా, నేటి ఈ నూతన పార్లమెంటు భవనం దానికి పూర్తి భిన్నంగా సాగింది. వివిధ మతాలకు చెందిన పూజారులు, సన్యాసులు వెంటరాగా, గణపతి హోమాలు, పూజల నడుమ ప్రధాన మంత్రి దీనిని ప్రారంభించారు. ప్రధాని పార్లమెంటు ఆవరణలోకి ప్రవేశించగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్ల ఆయనకు స్వాగతం పలికారు. కర్ణాటక శృంగేరి మఠం పూజారుఉలు వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రధాని గణపతి హెూమం నిర్వహించారు. రాచరికపు వ్యవస్థకు చిహ్నమైన రాజదండాన్ని లోక్‌సభ స్పీకర్ కుర్చీకి కుడివైపున ప్రతిష్ఠించడానికి ముందు, దానిని ఆధీనాల ప్రధాన పూజారుల నుంచి స్వీకరించి, సభలో ఊరేగింపుగా తీసుకెళ్లారు. రాజదండానికి మోడీ సాష్టాంగ నమస్కారం చేశారు.

సువర్ణ ఘడియలు : మోడీ

ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ ప్రతి దేశ అభివృద్ధి ప్రస్థానంలోనూ కొన్ని సమయాలు వస్తూ ఉంటాయని, అవి అమరత్వం పొంది శాశ్వతంగా నిలిచిపోతాయని, అటువంటి రోజే మే 28 అని ప్రధాని సెలవిచ్చారు. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఈ సువర్ణ ఘడియల సందర్భంగా భారతీయులందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. భారతీయులు తమ ప్రజాస్వామ్యానికి ఈ నూతన పార్లమెంట్ భవనాన్ని బహూకరించుకున్నారంటూ తనదైన శైలిలో ఉద్వేగపూరితంగా మాట్లాడారు. కొత్త పార్లమెంట్ భవనం ప్రజాస్వామ్య మిగతా 2లో

రెజ్లర్లపై పైశాచికం

నడిరోడ్డుపై ఈడ్చుకెళ్లి... బస్సుల్లో ఎత్తిపడేసి...

- ఢిల్లీలో అడుగడుగునా దౌర్జన్యకాండ
- జంతర్‌మంతర్ వద్ద దీక్షా శిబిరం కూల్చివేత
- క్రీడాకారులకు మద్దతుగా వెళ్లిన రైతులు, మహిళా సంఘాల నాయకుల అరెస్ట్

జిఎస్ఎల్‌వి - ఎఫ్ 12 రాకెట్

కౌంట్ డౌన్ ప్రారంభం

- నేడు 10.42 గంటలకు నింగిలోకి..

లోపలి పేజీలో..

రెజ్లర్లను నడిరోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టు చేస్తున్న ఢిల్లీ పోలీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నూతన పార్లమెంటు భవనం ఎదుట నిరసనకు యత్నించిన రెజ్లర్లపై మోడీ ప్రభుత్వం తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. గత కొన్ని వారాలుగా జంతర్‌మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజ్లర్లు ఆదివారం నూతన పార్లమెంట్ భవనానికి మార్చ్‌గా బయల్దేరారు. పెద్ద యెత్తున మోహరించిన పోలీసులు నిరసనకారులను రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి, వాహనాల్లో ఎత్తిపడేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు పెద్దయెత్తున నినాదాలు చేశారు. అరెస్టు చేసిన రెజ్లర్లను ఢిల్లీ పోలీసులు వివిధ స్టేషన్లకు తరలించారు. రెజ్లర్ల శిబిరాన్ని ధ్వంసం చేశారు. పోలీసుల దౌర్జన్యకాండపై రెజ్లర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. . న్యాయం కోసం పోరాడుతున్న తమకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు.

అంతకుముందు పార్లమెంట్ భవనం వైపు సాగుతున్న నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ, తోపులాట జరిగాయి. భద్రతా వలయాన్ని ఛేదించుకొని కొత్త పార్లమెంట్ వైపు ముందుకు వెళుతున్న ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత వినేష్ పోగట్, ఆమె సోదరి సంగీతా పోగట్ సహా పలువురు రెజ్లర్లను పోలీసులు నిర్బంధించారు. వినేష్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మరోవైపు తన సోదరికి రక్షణగా సంగీత కొద్దిసేపు రోడ్డుపై పడుకుని నిరసన తెలిపారు. వారి చేతుల్లోని జాతీయ పతాకాలను పోలీసులు లాగి పడేసి, ఈడ్చుకెళ్లి బస్సుల్లో కుక్కారు. రెజ్లర్లకు మిగతా 5లో

చల్లారని మణిపూర్

- తాజా అల్లర్లలో మరో నలుగురి మృతి
- 40 మంది తిరుగుబాటు దారుల కాల్చివేత

ఇంఫాల్ : బిజెపి పాలిత రాష్ట్రం మణిపూర్‌లో హింస మళ్లీ భగ్గుమనడంతోపాటు కొత్త జిల్లాలకు విస్తరించింది. శాంతి భద్రతలను తిరిగి నెలకొల్పే పేరుతో బిజెపి ప్రభుత్వం భద్రతాదళాలను భారీ ఎత్తున రంగంలోకి దింపింది. ఉగ్రవాది అన్న అనుమానమొస్తే వారిని వెంటనే కాల్చిపారేయాలని ఉత్తర్వులిచ్చింది. భద్రతాదళాల ఆపరేషన్‌లో ఒక్క రోజులోనే 40 మంది తూటాలకు గురై చనిపోయారు. వీరంతా ఉగ్రవాదులేనని ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ చెప్పారు. భద్రతాదళాలకు నిరసనకారులకు మధ్య పలు చోట్ల ఘర్షణలు ఇంకా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం సుగ్ను ప్రాంతంలో స్థానికులపై గుర్తు తెలియని సాయుధ దుండగులు కాల్పులు జరపడంతో ముగ్గురు మరణించారు. ఫాయెంగ్ ప్రాంతంలో మరొకరు మృతి చెందారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం ఇంఫాల్ చేరుకున్న ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ పాండే అక్కడి పరిస్థితిని సమీక్షించారు . మణిపూర్‌లో మెజారిటీ కమ్యూనిటీ మీతేలకు ఎస్‌టి హోదా ఇవ్వాలన్న నిర్ణయం, అటవీ ప్రాంత గిరిజనులను అడవుల నుంచి గెంటివేసే చర్యలు ప్రభుత్వం చేపట్టడంతో గిరిజన తెగల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ నెల 3 నుంచి హింస చెలరేగుతూనే ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే హింసాకాండలో 70 మందికి పైగా మరణించగా, 200 మంది వరకూ గాయపడ్డారు. సుమారు నాలుగు వేలకుపై ఇళ్లు పూర్తిగానూ, పాక్షికంగానూ దగ్ధమయ్యాయి. వాస్తవానికి హింసాకాండ తీవ్రత మరింత అధికంగా ఉంది. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. అప్పటి నుంచి కర్ఫ్యూను అమలు చేస్తున్నారు. మొబైల్ ఇంటర్నెట్‌ను నిషేధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 34 వేల మంది కేంద్ర బలగాలు మోహరించారున.

నేడు అమిత్ షా రాక

మణిపూర్‌లో పరిస్థితిని సమీక్షించడానికి మూడు రోజుల పర్యటనలో భాగంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం రాష్ట్రానికి రానున్నారు. గత వారమే అమిత్‌షా మణిపూర్ వస్తారని అన్నప్పటికీ, ఆయన అస్సాం దాకా వచ్చి తిరిగి వెళ్లిపోయారు.

పెట్రోల్ ట్యాంక్‌లో ఊపిరాడక

ముగ్గురు కార్మికులు మృతి

ప్రజాశక్తి-రాయచోటిటౌన్

అన్నమయ్య జిల్లాలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. రాయచోటి పట్టణంలో పెట్రోల్ బంక్‌లోని ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా ఉపిరాడక వైఎస్ఆర్ జిల్లా చింతకొమ్మదిన్నెకు చెందిన ఇద్దరు, పెండ్లిమర్రికి చెందిన ఒకరు మృతి చెందారు. అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బషీర్‌ఖాన్ హెచ్‌పి పెట్రోల్ బంక్‌లో నిరుపయోగంగా ఉన్న పెట్రోల్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు సంబంధిత కంపెనీకి చెందిన కార్మికులు శివ (20), రవి (32), ఆనంద్ (40) ట్యాంక్‌లో దిగారు. వీరిలో మొదట రవి అనే వ్యక్తి ట్యాంక్‌లో దిగి శుభ్రం చేస్తుండగా కిందకు జారిపడిపోయారు. ఆయన్ను కాపాడే ప్రయత్నంలో ఆనంద్ కూడా జారి పడిపోయారు. వీరిద్దరిని కాపాడేందుకు శివ ట్యాంక్‌లో దిగారు. ముగ్గురు ఊపిరాడక మృతి చెందారు. రెస్క్యూ టీమ్ సాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమిత్ షాతో సిఎం జగన్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కోరారు. ఆదివారం నాడిక్కడ కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. అమిత్ షా నివాసంలో 40 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు త్వరగా ఆమోదం తెలిపేలా చూడాలని కోరారు. వీలైనంత త్వరగా కేంద్ర కేబినెట్ ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో ఏపి భవన్ విభజన సహా షెడ్యూల్ 9, 10 ఆస్తుల విభజనపై అమిత్‌షాతో చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిల అంశాన్నీ ప్రస్తావించిన ముఖ్యమంత్రి, ఏపి విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులను పరిగణలోకి తీసుకుని వెంటనే బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈదురుగాలుల బీభత్సం

- విరిగిపడిన స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు
- పిడుగుపాటుకు ఇద్దరు మృతి

తిరుపతిలోని డిఆర్ మహల్ వద్దకారుపై విరిగి పడిన చెట్టు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గాలుల తీవ్రతకు అరటి తోటలు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. భారీ వృక్షాలు రోడ్లపై పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయి వైర్లు తెగిపడ్డాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలువురి ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అనంతపురం జిల్లాలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ఏటిగైరంపేట, గాదంపాలెం, లింగంపేట గ్రామాలలో సుమారు 40 ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. వెయ్యి ఎకరాల్లో పాక్షికంగా దెబ్బతిన్నాయి. గెలలు కోసే సమయంలో వర్షం కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉద్యాన శాఖాధికారులు సర్వే నిర్వహించి తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. అనంతపురం జిల్లా శింగనమల మండలం పరిధిలోని ఉల్లికల్లు గ్రామానికి చెందిన వడ్డే బాలకృష్ణ (30) తన తోటలో మొక్కజొన్న విత్తనాలను కూలీలతో నాటిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన గౌరీ శంకర్ (24) అనే యువకుడు తోటలోకి వచ్చారు. వర్షం కురవడంతో చెట్టు కిందకు వెళ్లారు. పిడుగుపడడంతో ఇద్దరూ మృతి చెందారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సాయంత్రం ఒక్కసారిగా పెద్ద ఎత్తున గాలిదుమారం రేగింది. మహానాడు ఫ్లెక్సీలు విరిగి పడిపోయాయి. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగిలో ఈదురుగాలులకు భారీ వృక్షం రహదారిపై పడిపోయింది. కోనసీమ జిల్లా ఆలమూరు, కొత్తపేట, ఆత్రేయపురంలో భారీ వర్షం కురిసింది. తిరుపతి నగరంలో ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. విద్యుత్తు తీగలపై చెట్లు పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డిఆర్ మహల్ వద్ద ఓ కారుపై చెట్టుపడడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కొరమేనుగుంట ప్రాంతంలో గాలికి గోడకూలి ఆటోపై పడటంతో ఆటో ధ్వంసమైంది.

ప్రయివేటు తప్పాలంటే బిజెపిని గద్దె దింపాలి

- ఎఐపిఇయు రాష్ట్ర మహాసభలో సిహెచ్ నర్సింగరావు
- ప్రజలను, కార్మికులను చైతన్యవంతం చేయాలి : గఫూర్

మహాసభలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

ప్రయివేటీకరణ ఆగాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. బిజెపి కుట్రలకు కార్మిక, కర్షక ఐక్యతతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు జరగనున్న అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం (ఎఐపిఇయు) 3వ ద్వైవార్షిక రాష్ట్ర మహాసభ కర్నూలులోని బిఎఎస్ కల్యాణ మండపంలోగల ఎన్ఎస్ మూర్తి సభా ప్రాంగణంలో ఆదివారం ప్రారంభమైంది. జాతీయ జెండాను సిహెచ్.నర్సింగరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ (ఎన్ఎఫ్‌పిఇ) జెండాను ఎఐపిఇయు సర్కిల్ కార్యదర్శి సిహెచ్.విద్యాసాగర్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. నర్సింగరావు ప్రారంభోపన్యాసం చేశారు. ప్రస్తుతం లౌకికవాదం, ప్రభుత్వ రంగం బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడిని ఎదుర్కొంటోందని తెలిపారు. దానిపై మహాసభలో చర్చించాలని దిశానిర్దేశం చేశారు. పోస్టల్ యూనియన్లు లేకుండా బిజెపి చేస్తోందని, ఇది కార్మికులందరి సమస్య అని తెలిపారు. దీన్ని సవాలుగా తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. తపాలా శాఖలో ఖాళీలను నింపడం లేదని, ఎంటిఎస్ పేరుతో అనేక పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని, అవి అమలైతే కార్మికులను యజమానులు బానిసల కంటే హీనంగా చూస్తారన్నారు. తపాలా శాఖను ప్రయివేటీకరించడం కోసం పోస్టల్ కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర చేసిందని, తీవ్ర పోరాటాలతో వెనక్కి తగ్గిందని తెలిపారు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారానే సంఘాల గుర్తింపు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. పి3 యూనియన్ గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. మోడీ విధానాలనే రాష్ట్రంలో జగన్ అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీ మోడీకి తలవంచుతున్నాయని తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను, కార్మికులను చైతన్యవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ పిలుపునిచ్చారు. దేశంలో పోరాడే కార్మిక సంఘాలు లేకుండా చేయాలని ప్రయత్నాలు చేస్తోందని, వీటిని ప్రతిఘటించకపోతే నష్టపోతామని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలుకు, ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించుకోవడానికి పోరాడాలని సూచించారు. మతం పేరుతో చేస్తున్న కుట్రలను అడ్డుకోవడానికి వచ్చే ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని కోరారు. మహాసభలో గ్రూప్-సి సర్కిల్ కార్యదర్శి బి.శ్రీధర్, జిడిఎస్ సర్కిల్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా కమిటీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సేవ్ పబ్లిక్ సెక్టార్ నాయకులు ప్రసాద్‌శర్మ, పెన్షనర్ల సంఘం నాయకులు పద్మనాభశాస్త్రి, ఎపిఎన్‌జిఒ నాయకులు ఉషారాణి, విరసం నాయకులు పినాకపాణి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామకృష్ణారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ ఉత్పత్తిలో మిగులు రాష్ట్రంగా ఏపి

- ఇంధన శాఖ కార్యదర్శి కె విజయానంద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ రంగంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా విద్యుత్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మిగులు రాష్ట్రంగా నిలిచిందని రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఆదివారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాతో పాటు వినియోగదారులకు కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్ను అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వార్షిక ఇంధన వినియోగం 2017-18లో 50,077 మిలియన్ యూనిట్లతో పోలిస్తే 2022-23లో 65,830 ఎంయు పెరిగిందన్నారు. అంటే దాదాపు 31.45 శాతం పెరిగిందన్నారు. ఇందుకు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విండ్ సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల స్థాపించడానికి ప్రభుత్వం ఇప్పటికే పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం 2020ని ప్రకటించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే విద్యుత్ రంగంలో దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్గా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో జెన్కో ఎమ్డి కెవిఎన్ చక్రధర బాబు, ట్రాన్స్కో జెఎండి మల్లా రెడ్డి, డిస్కమ్ల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, పద్మజానార్దన రెడ్డి, సంతోషరావు, ట్రాన్స్కో డైరెక్టర్లు భాస్కర్, వీరభద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

జిఎస్ఎల్వి - ఎఫ్ 12 రాకెట్ కౌంట్ డౌన్ ప్రారంభం

- నేడు 10.42 గంటలకు నింగిలోకి..

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

జిఎస్ఎల్వి-ఎఫ్12 రాకెట్ ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ కౌంట్డౌన్ ప్రక్రియ ప్రారంభించింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో ఆదివారం ఉదయం 7.12 గంటలకు ప్రారంభమైన ఈ ప్రక్రియ 27.30 గంటల పాటు నిర్విరామంగా కొనసాగనుంది. సోమవారం ఉదయం 10.42 గంటలకు ఈ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ రాకెట్ ద్వారా ఎన్విఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. శ్రీహరి కోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుంది. 2232 కిలోల బరువు ఉండే ఎన్విఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని భూధ్రువ కక్షలో ప్రవేశపెట్టనున్నారు. ఈ ఉపగ్రహం ద్వారా బహుళ ప్రయోజనాలు సమకూరనున్నాయి. 51.7 మీటర్ల ఎత్తు, 420 టన్నులు బరువు కలిగిన జిఎస్ఎల్వి -ఎఫ్12 రాకెట్ మొత్తం మూడు స్టేజిలు ఉంటుంది. రాకెట్ ప్రయోగం జరిగిన అనంతరం 18 నుండి 19 నిమిషాల మధ్య సమయంలో ఎన్విఎస్-01 ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్షకు చేర్చడం జరుగుతుంది. ఈ ఉపగ్రహం 12 సంవత్సరాల పాటు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారు.

ఆందోళనలో రాజధాని రైతులు

- మాస్టర్ ప్లాన్ మార్పుతో ఆశలు అడియాసలు
- రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధి శూన్యం
- విక్రయించుకోలేక, రుణాలు రాక రైతుల కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం

రాజధాని కోసం తుళ్లూరు-నేలపాడు మధ్యలో సమీకరించిన భూముల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారు. భవిష్యత్తు ఏమిటన్నదే వారికి అంతుబట్టడం లేదు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు ఇప్పటికే చాలా వరకు నష్టపోయారు. రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి భూ సమీకరణలో తిరిగి సిఆర్డిఎకు భూములు ఇచ్చిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సిఆర్డిఎకు భూ సమీకరణలో భూములు ఇచ్చిన వారికి అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఎప్పటికి అందుతాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. రాజధానిలో ఎనిమిదేళ్ల క్రితం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతుల ప్లాట్ల అభివృద్ధిని వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రాంతంలో 50,793 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఈ పరిణామం రైతులకు ఏ మాత్రమూ మింగుడుపడడం లేదు. పేదలకు సెంటు భూమి పంపిణీ నిమిత్తం ప్రభుత్వం దాదాపు 1,400 ఎకరాల్లో ప్రత్యేక ప్రాతిపదికన 25 లే అవుట్లను ఏర్పాటు చేసింది. మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో చూపిస్తున్న ఆసక్తి తమ ప్లాట్ల అభివృద్ధిపై చూపడంలేదని 29 గ్రామాల రైతులు వాపోతున్నారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం 24 వేల మంది రైతుల నుంచి 34,385 ఎకరాల భూమిని సమీకరించి సిఆర్డిఎకు అప్పగించింది. భూములు కోల్పోయిన వారిలో చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ మంది ఉన్నారు. రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి భూ సమీకరణలో భూములు ఇచ్చిన వారూ ఐదారు వేల మంది ఉన్నట్లు సమాచారం. వీరందరికి మూడేళ్లలో అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లను అప్పగించాల్సి ఉంది.

గత ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపలేదు. అప్పట్లో రిటర్నబుల్ ప్లాట్ల అప్పగింత కాగితాలపైనే జరిగింది. వాణిజ్య, గృహ అవసరాల నిమిత్తం మొత్తం 63,462 ప్లాట్లను ఎంపిక చేసి 42,529 ప్లాట్లను సంబంధిత భూ యజమానులకు 2019కి ముందే సిఆర్డిఏ రిజిస్ట్రేషన్ చేసింది. మిగతా ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ఇప్పటికీ పెండింగ్లో ఉంది. రైతుల నుంచి భూ పత్రాలన్నింటినీ సిఆర్డిఏ స్వాధీనం చేసుకుంది. అభివృద్ధి చేసిన ప్లాట్ల అప్పగింతకు ఎకరాకు రూ.కోటి చొప్పున రూ.35 వేల కోట్లు ఖర్చు అవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. అయితే సంబంధించి నిధులు సమీకరించలేకపోయింది. దీంతో, అభివృద్ధి చేసిన ప్లాట్లు రైతులకు దక్కలేదు. రైతులకు ఏర్పాటు చేసిన లేఅవుట్ల్లో కనీస సదుపాయాల్లేక చిట్టడవుల్లా తయారయ్యాయి. పిచ్చి చెట్లు పెరిగిపోయి ఎవరి ప్లాట్లు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి ఉంది. ప్లాట్లు ఇతరులకు అమ్ముకోవాలన్నా, బ్యాంకుల్లో రుణం పొందాలన్నా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికి ఎకరాకు రూ.3 కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు కావాలని, అంత సొమ్ము తమ వద్ద లేదని వైసిపి ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. టిడిపి ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్ కొనసాగింపుగా నవనగరాలు ఏర్పాటై, తమకు అభివృద్ధి చేసిన ప్లాట్లను అప్పగిస్తే తమ ప్లాట్లకు మంచి ధరలు వచ్చి ఉండేవని రైతులు అంటున్నారు. మూడు రాజధానుల పేరుతో ప్రభుత్వం దారుణంగా దెబ్బతీసిందని వాపోతున్నారు. టెక్నాలజీ సిటీ కోసం కేటాయించిన భూముల్లో 1400 ఎకరాలు తీసుకుని 50,793 ఇళ్ల నిర్మాణం చేపడితే తమ ప్లాట్లకు ధరలు ఎలా వస్తాయని రైతులు మదనపడుతున్నారు. జూలై 8 నుంచి ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని సిఎం జగన్ శుక్రవారం ప్రకటించారు. ఇళ్లు నిర్మించిన తరువాత కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా ఏం చేయగలమని ప్రశ్నిస్తున్నారు.

లౌకిక భారత్ కోసం దేశవ్యాప్త జాతాలు

- డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి భట్టాచార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి సమస్యల పరిష్కారానికి, లౌకిక భారత్ కోసం దేశవ్యాప్తంగా జాతాలు నిర్వహించనున్నామని డివైఎఫ్ఐ అఖిల భారత ప్రధాన కార్యదర్శి హిమాగ్నరాజ్ భట్టాచార్య అన్నారు. మోడీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కేంద్ర కమిటీ సమావేశాలు రెండు రోజులపాటు హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ఈ సమావేశాలకు దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి కేంద్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెండో రోజైన ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్మీట్లో హిమాగ్నరాజ్ భట్టాచార్య మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ని అరెస్టు చేయాలని మహిళా రెజ్లర్లు ఏప్రిల్ 17 నుంచి నిరసనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. బ్రిజ్భూషణ్తోపాటు మరో ఎంపి సందీప్సింగ్పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు నిరవధికంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రెజ్లర్లను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ రోజు బ్లాక్ డే అని అన్నారు.

2014లో అధికారంలోకి రాగానే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తున్నారని విమర్శించారు. డివైఎఫ్ఐ అఖిలభారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు రహీం మాట్లాడుతూ దేశ రక్షణ వ్యవస్థ ప్రమాదంలో పడేవిధంగా అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువతను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం ఢిల్లీ జంతర్ మంతర్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రెజర్లపై ప్రభుత్వం, పోలీసులు నిరంకుశంగా వ్యవహరిస్తూ దాడులు చేసి, అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ అఖిలభారత కార్యదర్శివర్గ సభ్యులు జెక్ థామస్, సంజీవ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, కేంద్ర కమిటి సభ్యులు ఇర్ఫాన్గుల్, అనిల్, హైద్రాబాద్ జిల్లా కార్యదర్శి జావెద్ పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్దీవులతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు రాబోయే రెండు రోజుల్లో ముందుకెళ్లే పరిస్థితులు ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ఫలితంగా రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇదే సందర్భంలో ఒకటి రెండు ప్రాంతాల్లో వేడిగాలులు, అసౌకర్య వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ నెల 29న వైఎస్ఆర్ జిల్లాలోని చాపాడు, కమలాపురం, ప్రొద్దుటూరు, వల్లూరు, వీరపునాయునిపల్లి, ఎర్రగుంట్ల మండలంలోని వడగాల్పులకు వీలుందన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కురిచేడులో 45.5 డిగ్రీల సెల్షియస్, నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 45.2డిగ్రీల సెల్షియస్, పల్నాడు జిల్లా రొంపిచెర్లలో 44.8 డిగ్రీల సెల్షియస్, గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలో 44.7డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

భారాలు తగ్గిస్తేనే రవాణా రంగానికి మనుగడ

- ఇంధన ధరలకు కళ్లెం వేయకుండా ఖర్చు తగ్గేదెలా?
- విడి భాగాల రేట్లు, పన్నులు, సెస్లు తగ్గించాల్సిందే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో రవాణా రంగానిది కీలకపాత్ర. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలంటే రహదారుల నిర్మాణాలతో పాటు వాహనాలకు సంబంధించిన ఇంధన, ఇతర సమస్యలను పరిష్కరించాల్సివుంటుంది. ప్రధానంగా డీజిల్, పెట్రోలు ధరలు భారీగా పెరిగిపోవడం, టోల్ ఛార్జీలు అడ్డగోలుగా పెంచేయడం రవాణా రంగాన్ని చావు దెబ్బతీస్తున్నాయి. దీంతో రవాణాకయ్యే ఖర్చు కూడా విపరీతంగా పెరిగిపోయి ప్రజలపై పెను భారం పడుతోంది. చతికిలపడిన రవాణా రంగానికి పునర్జీవం కల్పించాలంటే భారాలు తగ్గించడం ఒక్కటే మార్గం. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలో శనివారం జరిగిన నీతి అయోగ్ సమావేశంలో ఉత్పాదక రంగంలో రవాణా ఖర్చులను భారీగా తగ్గించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్రంలోని వాహన యజమానులు, రవాణా రంగంపై ఆధారపడినవాళ్లు అంతా స్వాగతిస్తున్నారు. కానీ ఆ ఖర్చు తగ్గించే బాధ్యత పాలకులపైనే ఉందన్న సంగతిని వారు గుర్తు చేస్తున్నారు. డీజిల్, పెట్రోలు, ఇతర గ్రీజ్, ఇంజిన్ ఆయిల్ వంటి ఇతర పెట్రో ఉత్పత్తులు, వాహనాల విడి భాగాలు వంటి ధరలకు కళ్లెం వేయకుండా, టోల్ ఛార్జీలు, సెస్లు, ఇతర పన్ను భారాలు తగ్గించకుండా రవాణా ఛార్జీలు తగ్గాలంటే ఎలా తగ్గుతాయని వారు ప్రశ్నిస్తున్నారు.

దేశంలో రవాణా ఖర్చులు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో 15 శాతంగా వుంది. అమెరికా లాంటి దేశాల్లో అది 7.5 శాతంగా వుంది. దేశంలో రవాణా ఖర్చులను కనీసంగా 9 శాతానికి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రవాణా ఖర్చులను 15 శాతం నుండి 9 శాతానికి తగ్గించే లక్ష్యంతో జాతీయ రవాణా విధానాన్ని (లాజిస్టిక్ పాలసీ) విడుదల చేసింది. కానీ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరవధికంగా పెట్రో ధరలను పెంచుతూనేపోతోంది. వాహనాల స్పేర్ పార్ట్స్ ధరలు, పన్నులు, టోల్ ఛార్జీలు యేటికేడూ గుదిబండగా మారుతున్నాయి. ప్రకటనల్లో, పాలసీల్లో గొప్పలు చెప్పి చేతల్లో భారాలు మోపితే రవాణా ఖర్చు ఎలా తగ్గుతుందని కేంద్ర ప్రభుత్వ వాహన రంగంపై ఆధారపడిన యజమానులు, ఉద్యోగులు, కార్మికులు నిలదీస్తున్నారు.

ముఖ్యంగా రవాణా రంగంలో కీలకం డీజిల్ ధర..కేంద్ర ప్రభుత్వం ఆకాశమే హద్దుగా ఇంధన ధరలు పెంచుతూ పోతోంది. కేంద్రంతో పోటీగా రాష్ట్ర ప్రభుత్వం కూడా సెస్ల రూపంలో పెట్రో ఉత్పత్తులపై అదనపు భారం మోపుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగా ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర రాష్ట్రంలో లీటర్ రూ 99.50గా వుంది. ఇది పొరుగు రాష్ట్రాల కంటే రూ.5 ఎక్కువ. అలాగే రోడ్ ట్యాక్స్లు కూడా భారీగా పెంచుతున్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రవాణా వాహనాల త్రైమాసిక పన్నులను భారీగా పెంచింది. ఆరు టైర్ల లారీకి రూ.4,790, పది టైర్ల లారీకి రూ.8,390, 12 టైర్ల లారీకి రూ.10,910, 14 టైర్ల లారీకి రూ.13,430, 16 టైర్ల లారీకి రూ.15,590 చేసింది. అలాగే గ్రీన్ ట్యాక్స్ను కూడా ఏకంగా రూ.20 వేల వరకు పెంచింది. పొరుగు రాష్ట్రాల్లో గ్రీన్ ట్యాక్స్ రూ.200 నుండి రూ.500 మించి లేకపోవడం గమనార్హం.

రాష్ట్రంలో రోడ్ల నిర్వహణలోపం కూడా రవాణా రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. రోడ్లు గుంతలు, గుంతలుగా వుండటంతో వాహనాలు మరమ్మతులకు గురై యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇలా రాష్ట్రంలో వాహనరంగంపై డీజిల్, పన్నులు, టోల్ ఛార్జీలు ఏటేటా పెంచుతూ రవాణాఖర్చులను తగ్గించడం ఎలా సాధ్యం అవుతుందని లారీ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇంధన ధరలు, పన్నులు, టోల్ ఛార్జీలు తగ్గించి రవాణా రంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వైవి ఈశ్వరరావు కోరారు. నేషనల్ లాజిస్టిక్ పాలసి మేరకు రవాణా ఖర్చులను తగ్గించే అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీలన్నీ ఐక్యంగా పోరాడాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా పోరాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 836వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్ప్లాంట్లోని ఐఎన్టియుసి కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, కన్వీనర్ కెఎస్ఎన్ రావు, కో-కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడారు. 75 ఏళ్లలో అభివృద్ధి చేసుకున్న దేశ ప్రజల విలువైన సంపదను ఆజాదికా అమృత్ పేరుతో కారు చౌకగా అదానీ, అంబానీలకు బిజెపి ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి పాలనకు తెలుగు రాష్ట్రాల పార్టీలు ఒత్తాసు పలకడం తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడంగా భావిస్తున్నామన్నారు. దేశంలో నూతన పార్లమెంట్ భవన ప్రారంభోత్సవాన్ని 19 రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయని తెలిపారు. కేంద్రం రాష్ట్రాల విలువలను విచ్ఛిన్నం చేస్తోందని విమర్శించారు. ప్లాంట్ పరిరక్షణ కోసం రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వంపై నిరసన గళం వినిపించడం ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలు సాధించుకోగలమన్నారు. కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, వరంధామయ్య, బివి రమణమూర్తి, మంత్రి గోపినాగేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

కాకినాడలో ధర్నా నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

బదిలీలు మాన్యువల్గా చేపట్టాలి

- ఫ్యాప్టో ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల ధర్నాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

బదిలీలు, ఉద్యోగోన్నతులు ఆన్లైన్లో కాకుండా మాన్యువల్గా చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఆదివారం డిఇఒ కార్యాలయాల వద్ద ధర్నాలు చేశారు. ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిఇఒలకు, డిప్యూటీ డిఇఒలకు వినతి పత్రాలు అందజేశారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, గుంటూరు, కృష్ణా, కడప జిల్లాల్లో ఉపాధ్యాయులు ధర్నాలు చేశారు. ఏలూరులో ఫ్యాప్టో రాష్ట్ర కో చైర్మన్ కె.నరహరి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఖాళీలను బ్లాక్ చేయొద్దని, బదిలీల జిఒలో ఉన్న అసంబద్ధాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేయడం అన్యాయమన్నారు. తాత్కాలిక ప్రమోషన్లతో ఉపాధ్యాయులు కొత్త ప్రాంతాల్లో పనిచేశాక వాటిని రద్దు చేసి, మళ్లీ ప్రమోషన్ల ప్రక్రియకు తెరతీయడం సరికాదన్నారు. గత విద్యా సంవత్సరమంతా బదిలీల పేరుతో కాలయాపన చేసి గందరగోళానికి గురిచేశారని విమర్శించారు. తక్షణమే షెడ్యూల్ను ప్రకటించి మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా ఎస్జిటిలకు స్కూల్ అసిస్టెంట్గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టిచాకిరీ కిందకే వస్తుందన్నారు. వారు పనిచేసిన కాలానికి ప్రభుత్వం ప్రకటించిన గౌరవ భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వకుండా తప్పించుకునేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఈ నెల 17న మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో అన్ని ఉద్యోగోన్నతులు మాన్యువల్గా జరపడానికి హామీ ఇచ్చారన్నారు. హామీకి భిన్నంగా ఆన్లైన్లో జరిపేందుకు అధికారులు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. ఖాళీలు ఎక్కడ ఉన్నాయో చూపకుండా ప్రమోషన్లు వద్దనుకునేవారు రాతపూర్వకంగా అన్విల్లింగ్ తెలపాలని ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఎంఇఒ-2 ప్రమోషన్ల షెడ్యూల్ను కూడా ఇంతవరకు ప్రకటించలేదని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలు ఐక్యతతో ఇటువంటి అసంబద్ధ విధానాలను ఎదుర్కోవాలని కోరారు.

ప్రధాన మంత్రి అయిన నేను..

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంటులో రాజదండం ప్రతిష్ఠ అనంతరం నమస్కరిస్తున్న ప్రధాని మోడీ, లోక్సభ స్పీకర్ ఓంబిర్లా

నూతన పార్లమెంటులో సిఎం జగన్

దేవాలయమని, ఇదిదేశ గౌరవాన్ని మరింత పెంచిందన్నారు.

ఎంపిల సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా పార్లమెంట్

రానున్న కాలంలో ఎంపిల సంఖ్య పెరుగుతుందని ప్రధాని మోడీ చెప్పారు. పాత పార్లమెంట్ భవనంలో అనేక ఇబ్బందులు ఉండేవని, సభ్యులు కూర్చోవడానికే కాకుండా, సాంకేతిక సమస్యలు కూడా ఉండేవని చెప్పారు. రాబోయే కాలంలో ఎంపిల సంఖ్య పెరుగుతుందని, అందుకు తగినట్లుగానే నూతన పార్లమెంట్ భవనాన్ని నిర్మించామని చెప్పారు. కొత్త భవనంలో ఆధునిక వసతులు ఉన్నాయని చెప్పారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన అమృతకాలం అనంతమైన కలలను, అసంఖ్యాకమైన ఆకాంక్షలను నెరవేర్చే కాలమని అన్నారు. 21వ శతాబ్దపు నవ భారతం సమున్నత స్థాయి ఆత్మవిశ్వాసంతో ఉందన్నారు. బానిసత్వపు మనస్తత్వాన్ని విడిచిపెట్టిందన్నారు. సావర్కర్ను ఆయన గుర్తు చేసుకున్నారు.

లోక్సభ స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ ఈ అమృత ఘడియల్లో దేశ ప్రతిష్ఠ పెరిగిందని, మన బలమైన భవిష్యత్తుకు ప్రజాస్వామ్యమే పునాది అని అన్నారు. అంతర్గత, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం మన పార్లమెంట్కు ఉందన్నారు. కొత్త పార్లమెంట్లో కొత్త ఆలోచనలు, మంచి సూత్రాలతో ముందుకు వెళ్దామని అన్నారు. మోడీ సారథ్యంలో రెండున్నరేళ్లలో కొత్త పార్లమెంటు నిర్మించడం చాలా సంతోషకరమని, ఇది ఒక మైలురాయి అని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్నాథ్ కోవింద్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంపిలు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.75 నాణేన్ని ఆవిష్కరించిన మోడీ

కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా రూ.75 నాణెంతో పాటు స్టాంపును ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ నారాయణ్ సింగ్ విడుదల చేశారు. ఈ నాణానికి ఒకవైపు అశోక స్తంభంలోని సింహ తలాటం, దానికి దిగువన 'సత్యమేవ జయతే' అక్షరాలు ఉంటాయి. ఎడమ వైపున దేవనాగరి లిపిలో 'భారత్' అని, కుడివైపున 'ఇండియా' అని ఆంగ్లంలో రాసి ఉంటుంది. అలాగే దిగువన నాణెం విలువ అయిన 75 ముద్రించి ఉంటుంది. నాణానికి మరోవైపు పార్లమెంట్ భవన సముదాయం ముద్రించి ఉంటుంది. దీనికి పైన.. సంసద్ సంకుల్ అని దేవనాగరి లిపిలో.. దిగువన పార్లమెంటు కాంప్లెక్స్.. అని ఆంగ్లంలో రాసి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీతో పాటు లోక్సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపిలు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ

మొదటి పేజి తరువాయి

మారుస్తామని పేర్కొన్నారు. యువగళం పథకం కింద నిరుద్యోగ యువతకు యువగళం నిధి పేరుతో నెలకు రూ.3 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పిస్తామని పేర్కొన్నారు. అన్నదాత పథకం కింద రైతులను ఆదుకునేందుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇంటింటికీ తాగునీరు కింద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. టిడిపికి వెన్నెముకగా ఉన్న బిసిలకు రక్షణ చట్టం తీసుకొస్తామని ప్రకటించారు. పూర్ టు రిచ్ పథకం కింద పేదలను సంపన్నులుగా చేస్తామని, వారి ఆదాయం రెట్టింపు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజలు (పిపిపి) విధానంలో దీనిని అమలు చేస్తామన్నారు. ముగ్గురు పిల్లలు కంటే ఎక్కువ కలిగిన వారు స్థానిక సంస్థల్లో పోటీ చేయకూడదనే చట్టాన్ని రద్దు చేస్తామని తెలిపారు. దసరా నాటికి పూర్తి స్థాయి మ్యానిఫెస్టో ప్రకటిస్తామన్నారు. ఈ పథకాలను ఇంటింటా కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. జగన్ పాలనలో రాష్ట్రం నాశనమయిందని, ఆయన పాలనకు చరమగీతం పాడాలని కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. రాబోయే కురుక్షేత్ర యుద్ధానికి అందరూ సిద్ధం కావాలని కోరారు. ఎన్నికల ఆయుధం భవిష్యత్తు గ్యారెంటీ పథకం అని పేర్కొన్నారు. ఎన్నికల శంఖారావాన్ని మహానాడు వేదికగా ఆయన పూరించారు. అనేక సంక్షేమ పథకాలకు టిడిపి వ్యవస్థాపకులు ఎన్టి రామారావు నాంది పలికారని తెలిపారు.

ఎన్టిఆర్ శతజయంతి ఉత్సవాలను ప్రపంచవ్యాప్తంగా నిర్వహించామన్నారు. 2014-19 కాలంలో టిడిపి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. టిడిపి కార్యకర్తలను వేధించిన వారిని ఎక్కడున్నా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. టిడిపి పేదల పార్టీ అని, వైసిపి ధనికుల పార్టీ అని పేర్కొన్నారు. టిడిపి కార్యక్రమాలకు అడ్డుకోవాలని చూస్తే తొక్కుకుంటూపోతామని హెచ్చరించారు. రాష్ట్రంలో సహజ వనరులను జగన్ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉచితంగా దొరికిన ఇసుక ఇప్పుడెందుకు దొరకడం లేదని ప్రశించారు. రాష్ట్రంలో జె ట్యాక్స్ వల్ల పారిశ్రామికవేత్తలు, అప్పులతో రైతులు, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. వివేకా హత్యకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వందల కోట్ల రూపాయల ఆస్తి ఉన్న జగన్ పేదవాడు ఎలా అవుతాడని ప్రశ్నించారు.

బహిరంగ సభలో చంద్రబాబుతో బాలయ్య

టిడిపికి పూర్వ వైభవం ఖాయం : బాలకృష్ణ

అన్ని వర్గాల ప్రజలనూ అవస్థల పాలు చేసి, అన్ని వ్యవస్థలనూ నాశనం చేసిన ప్రస్తుత పాలనపోయి టిడిపికి పూర్వ వైభవం రావడం ఖాయమని హిందూపురం ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ అన్నారు. బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఎన్టిఆర్ టిడిపిని పెట్టి అధికారంలోకొచ్చాక ఎన్నో సంస్కరణలు తెచ్చారన్నారు. పేదవాడి ఆకలి తీర్చారని తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చారని గుర్తు చేశారు.

అందుకే ఆయన మహానుభావుడు అయ్యాడని, మహానుభావుడు అవ్వాలంటే మహోన్నత వ్యక్తిత్వం, ఆదర్శం వంటి మంచి లక్షణాలు ఉండాలన్నారు. కానీ, ఇప్పుడు వేరే రకం మహానుభావులను చూస్తున్నామని పరోక్షంగా జగన్ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

నందమూరి బాలకృష్ణ రాకతో టిడిపి కార్యకర్తల్లో ఉత్సాహం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, ఎంఎల్‌ఎ నందమూరి బాలకృష్ణ, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఎన్‌టిఆర్ శత జయంతిని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని కోటిపల్లి బస్టాండ్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేశారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని పూలదండలతో, కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌ను పసుపు రంగు జెండాలతో అలంకరించారు. ఉదయం తొమ్మిది గంటలకే చంద్రబాబు వస్తారన్న సమాచారంతో రాజమహేంద్రవరంలోని మాజీ కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చంద్రబాబు 11 గంటలకు చేరుకున్నారు. కాబోయే సిఎం, జై బాబు అంటూ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ రాకతో ప్రత్యేకత సంతరించుకుంది. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపించారు. జై బాలయ్య నినాదాలతో కొద్దిసేపు హోరెత్తించారు. అభిమానులకు బాలకృష్ణ అభివాదం చేస్తూ చంద్రబాబుతో కలిసి మహానాడు ప్రాంగణానికి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు కొద్దిసేపు ట్రాఫిక్ మళ్లించారు.

ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించిన అనంతరం విగ్రహం వద్ద చంద్రబాబు, బాలకృష్ణ, అచ్చెన్నాయుడు, టిడిపి నాయకులు

జగన్ పాలనకు చరమగీతం పాడుదాం

- టిడిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన ఎవ్వరినీ వదిలేది లేదు : లోకేష్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గడిచిన నాలుగేళ్లుగా అన్ని వర్గాల ప్రజలనూ ఇబ్బందుల పాలు చేస్తున్న రాష్ట్రంలో జగన్ పాలనకు చరమగీతం పాడుదామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. మహానాడులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. చంద్రన్న అభివృద్ధి, సంక్షేమం చేస్తే... జగన్ అవినీతి చేస్తున్నారని ఆరోపించారు. చంద్రన్న రాష్ట్రాన్ని నిలబెడితే, జగన్ కూల్చేస్తున్నారని, చంద్రన్న హీరో అయితే, జగన్ జీరో అని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండగా పార్టీ జెండా పట్టుకుని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా మొక్కవోని దీక్షతో పనిచేస్తున్న పసుపు సైన్యం కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటానని అన్నారు. కార్యకర్తలను వేధింపులకు గురిచేసిన వారు అమెరికా నుంచి అమలాపురం వరకూ ఎక్కడ ఉన్నా వదిలేది లేదని హెచ్చరించారు. తన పాదయాత్రను అడ్డుకోవడానికి రాజారెడ్డి రాజ్యాంగం ద్వారా జిఒ తెచ్చారని విమర్శించారు. సాగనిస్తే పాదయాత్ర, అడ్డుకుంటే దండయాత్ర అని చెప్పానని, ఎవరూ అడ్డుకోలేకపోయారని లోకేష్ గుర్తు చేశారు. ఈ పాదయాత్రలో ప్రజల కష్టాలు, కన్నీళ్లు తెలుసుకుంటున్నానని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం ముందుకు సాగుతున్నానన్నారు. జగన్ పాలనలో అన్ని ధరలూ పెంచేసి, చెత్త మీద కూడా పన్ను వేశారని, మనం పీల్చే గాలిమీద కూడా పన్ను వేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాఖ్యానించారు.

జగన్ మాయమాటలు నమ్మొద్దు : అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్రంలో అన్ని వనరులూ దోచుకోవడమే కాకుండా అన్ని వ్యవస్థలనూ సర్వనాశనం చేసిన జగన్ ఇప్పుడు అమాయకంగా చెబుతున్న మాయమాటలను నమ్మొద్దని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు కోరారు. మహానాడులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. దేశంలో అందరి ముఖ్యమంత్రులకన్నా అత్యంత ధనవంతుడైన జగన్ పేదవాడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. పేదవాడైతే ఎనిమిది ప్యాలెస్‌లు ఎలా వచ్చాయన్నారు. జగన్ పాలనలో అన్ని వ్యవస్థలూ సర్వనాశనం అయిపోయిన నేపథ్యంలో రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. పేదలను జగన్, వైసిపి వారు ఎలా దోచుకున్నారో చంద్రన్న వచ్చాక వెలికి తీసి, ఆ సొమ్ముని మళ్లీ పేదలకు పంచుతామని తెలిపారు.

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL
VISHAKHAPATNAM
Ground & Amp: 1st Floor, 31-31-21,
Sai Baba Street, Narayan Bhawan,
Dabagardens, Visakhapatnam - 530020
Case No.: O.A.No. 214 OF 2023
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
HDFC Bank Limited Vijayawada Branch
And
M/s Sree Ramya Steel Traders and others
To,
D1. Sree Ramya Steel Traders, Rep by Its Proprietor Smt. Kanumuri Ramya, #1-245, Madhira Road, Near Bus Stand, Nandigama, Andhra Pradesh-521185
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
WHEREAS, OA/214/2023 was listed before Hon'ble Presiding Officer/Registrar on 24/05/2023.
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.52,99,861.73 (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: (iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 24/05/2023 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: 04/05/2023.
Signature of the Officer Authorized to issue summons

తరలివచ్చిన పసుపు దళం

- జోరువానలోనూ కొనసాగిన సభ
- జాతీయ రహదారిపై కొనసాగిన రద్దీ

సభకు తరలొస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలో ఆదివారం మహానాడులో భాగంగా ఆదివారం నిర్వహించిన బహిరంగ సభకు పసుపుదళం తరలొచ్చింది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల ముగింపు సభ కావడం, ఎన్నికల మ్యానిఫెస్టోను చంద్రబాబు ప్రకటించనున్నారని తెలియడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి రాజమహేంద్రవరానికి తరలొచ్చారు. సభాప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. ప్రాంగణానికి వెలుపలా వేలాది సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉండిపోయారు. సభా ప్రాంగణానికి వెళ్లే రహదారులన్నీ కార్యకర్తలు, వాహనాలతో నిండిపోయాయి. సాయంత్రం నాలుగు గంటలకు ఎంపి రామ్మూర్తినాయుడు అధ్యక్షతన బహిరంగ సభ ప్రారంభమైంది. ఆ పార్టీ ముఖ్యనాయకులు ప్రసంగించారు. చివరిగా పార్టీ అధినేత చంద్రబాబు ప్రసంగించారు. జోరువానలోనూ బహిరంగ సభ కొనసాగింది. సభ ప్రారంభమైన 15 నిమిషాలకే వాతావరణం పూర్తిగా మారిపోయింది. గాలిదుమ్ము, అనంతరం భారీ వర్షం పడింది. మహానాడు కోసం కట్టిన ఫ్లెక్సీలు ఈ గాలి దుమారానికి పడిపో యాయి. మరికొన్ని చిరిగిపో యాయి. జోరువాన లోనూ సభను కొనసాగించారు. టిడిపి ముఖ్య నాయకులు వేదికపై తడుస్తూనే ప్రసంగించారు.

కార్యకర్తలు కుర్చీలను తలపై పెట్టుకుని లేచి నిలబడి బహిరంగ సభను వీక్షించారు. కొందరు ఫ్లెక్సీల చాటు నుంచి విన్నారు. మహానాడు సభ నిర్వహణ నేపథ్యంలో ఆదివారమూ జాతీయ రహదారిపై రద్దీ నెలకొంది. ఉదయం ఎనిమిది గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు సభా ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రయివేట్ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చారు. జిల్లా పోలీసు అధికారులు సుమారు 25 వేల వాహనాలు వస్తాయని అంచనాలు వేశారు. దీనికి తగ్గట్లుగా పది పార్కింగ్ స్థలాలు అందుబాటులోకి తెచ్చారు. ఆయా పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిపోవడంతో అత్యధిక మంది జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలను నిలిపి సభాస్థలానికి తరలివచ్చారు.

మోడీ మూల్యం చెల్లించక తప్పదు : సిపిఐ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ వ్యవస్థలను నాశనం చేస్తోన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ హెచ్చరించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని 21 రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నా మోడీ ఖాతరు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమానికి దేశ ప్రథమ పౌరురాలైన రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం రాజ్యాంగ ధిక్కారమేనని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు డబ్బులివ్వాలని జగన్ సర్కారు కేంద్రానికి లేఖలు రాసినా స్పందన లేదన్నారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తమ పార్టీ ఆధ్వర్యంలో జూన్ 2, 3 తేదీల్లో రాయలసీమలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరుతూ వెలిగొండ నుంచి ఒంగోలు కలెక్టరేట్ వరకు ప్రజా ప్రదర్శన చేపడతామని, త్వరలోనే తేదీలను ప్రకటిస్తామని చెప్పారు.

చేతబడి చేశాడనే అనుమానంతో అన్న హత్య !

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

తనకు చేతబడి చేశాడనే అనుమానంతో అన్న వరసయ్యే వృద్ధుణ్ణి తమ్ముడు హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం పట్లవీడులో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కెం వెంకయ్య (70), అక్కెం పకీరయ్య అన్నదమ్ముల పిల్లలు. వెంకయ్య దాచేపల్లిలోని తన కుమార్తె వద్ద ఉంటుండగా ఫకీరయ్య పిడుగురాళ్లలో కుమారుని వద్ద ఉంటున్నారు. పక్షవాతం వచ్చి ఒక కాలు, ఒక చేయి సరిగా పనిచేయని ఫకీరయ్య వాకర్ సాయంతో నడుస్తుంటాడు. వీరు పింఛను తీసుకునే నిమిత్తం గ్రామానికి అప్పుడప్పుడు వస్తుంటారు. వీరికి గ్రామంలో వారసత్వంగా వచ్చిన రెండున్నర ఎకరాలు పొలం ఉంది. దీని హద్దుల విషయంలో గతంలో పలుమార్లు వివాదాలయ్యాయి. ఇటీవల వెంకయ్య పొలాన్ని కొలతలు వేయించి హద్దులు వేసుకున్నారు. ఈ క్రమంలో వెంకయ్య మూడ్రోజుల కిందట గ్రామానికి వచ్చారు. ఇది తెలిసిన ఫకీరయ్య శనివారం రాత్రి పిడుగురాళ్ల నుండి పట్లవీడుకు వచ్చి రాత్రి అందరూ నిద్రించాక వెంకయ్యను గొడ్డలితో నరికి హత్య చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. వెంకయ్యకు నలుగురు కుమార్తెలు కాగా వారికి వివాహాలై వేర్వేరు గ్రామాల్లో ఉంటున్నారు ఫకీరయ్యకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. వెంకయ్య చేతబడి చేయడం వల్లే తనకు పక్షవాతం వచ్చిందనే అనుమానంతో ఫకీరయ్య ఈ హత్యకు పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం.

OFFICE OF THE RECOVERY OFFICER-II
DEBTS RECOVERY TRIBUNAL
(Ministry of Finance, Government of India)
Ground & 1st Floor, 31-31-21, Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.
FORM – 17
(See Rule No. 53 of the Second Schedule to the Income Tax Act, 1961)
NOTICE FOR SETTLING A SALE PROCLAMATION
R.P. No.640 of 2018 in OA No.602 of 2016
Canara Bank, Chataparru Branch, Eluru Mandal, West Godavari District
Versus
Sri Kunisetti Raghu Ram
To
(CD-1) Sri Kunisetti Raghu Ram, S/o Rama Rao, D.No.3-3-20, Kamakotinagar, Vidhyadharapuram, Vijayawada, Krishna District-534002.
Whereasin execution of Recovery Certificate dated 15.11.2018 in O.A. No.602/2016 for Rs.34,66,810/- with future interest @ 10.90% p.a. compounded with monthly rests from 01.06.2016 till realization forwarded by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam, the undersigned has ordered the sale of the under mentioned immovable properties.
You, the Certificate Debtors/ Defendants above named, are hereby informed that on or after fifteenth day from the date of service of this notice has been fixed for drawing up the proclamation of sale and settling the terms thereof. You are requested to bring to the notice of the undersigned any encumbrances, charges, claims or liabilities attaching to the said properties or any portion thereof.
SPECIFICATION OF PROPERTIES
SCHEDULE-A: Site measuring an extent of 580.8 sq.yards covered by R.S.No.77/2, situated at Gunipudi Sub-Registrar Office, Palakoderu, Gollalakoderu Panchayat, Gollalakoderu Village, West Godavari District boundaries:- East : 24.00 ft Width of Road, South: Site belongs to Sri Mamidisetti Lakshmi Ganapathi Rao, West: Site belongs to Sri Gottumukkala Soma Raju, North: Site belongs to Sri Konisetti Rama Rao.
Given under my hand and seal of this Tribunal at Visakhapatnam on the 17th May, 2023
(B.N.S.V.S.K. Bangarraju) Recovery Officer-II
Debts Recovery Tribunal, Visakhapatnam

మంత్రి బొత్సకు సమస్యను వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు

అశాస్త్రీయ సంస్కరణలను ఉపసంహరించుకోవాలి

- మంత్రి బొత్సకు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిగ్రీ విద్యలో తీసుకొస్తున్న అశాస్త్రీయమైన సంస్కరణలను ఉపసంహరించుకోవాలని, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు. ఆదివారం విజయనగరంలో మంత్రి బొత్స నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ఎటువంటి జిఒలూ విడుదల చేయకుండానే విజయనగరం, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పి భాస్కర్ సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. రానున్న విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ మొదటి ఏడాదిలో క్లస్టర్ విధానం అమల్లోకి వస్తుందని, దానికి సిద్ధంగా ఉండాలని చెప్పారని గుర్తుచేశారు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు డ్రాపవుట్లుగా మిగిలిపోవడమే కాక ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు లేరనే వంకతో చాలావరకు సబ్జెక్టు గ్రూపులు మూతపడనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైన మూడు సబ్జెక్టుల ప్రాధాన్యత తగ్గిపోతుందన్నారు. అన్ని సబ్జెక్టులపై అవగాహన లేకపోవడం వల్ల ఉన్నత చదువుల్లో కావాల్సిన దానిని ఎంచుకునే అవకాశం ఉండదని తెలిపారు. ఇప్పుడున్న విద్య పరిస్థితి ఉపయోగకరంగానే ఉందని, ఉన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత ముందుకు వెళ్లే అవకాశం ఉందని అన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీచేయడం, డిగ్రీ కళాశాలలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా విద్యను బోధించడంపై సర్కారు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సిహెచ్ వెంకటేష్, పి రామ్మోహన్‌రావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సిహెచ్ హరీష్, ఎన్ రుద్రప్రసాద్ పాల్గొన్నారు.

మినిమం టైం స్కేలు అమల్జేయాలి

- ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సెస్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమానవేతనం, మినిమం టైం స్కేలు (ఎంటిఎస్) అమలు చేయాలని నేషనల్ హెల్త్‌మిషన్ స్టాఫ్ నర్సెస్ యూనియన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎమ్) స్టాఫ్ నర్సెస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షురాలు డి దయామణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు యూనియన్ ప్రతినిధులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ 02.05.23న జీఓ నెంబర్ 60ని విడుదల చేసిందని, అయితే ఆ తర్వాత వెనువెంటనే జీతాలు తగ్గిస్తూ 11.05.23న జీఓ నెంబర్ 64 ఇస్తూ తీవ్ర అన్యాయం చేశారని వాపోయారు. దీనిపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వకవాలని, మినిమమ్ టైమ్ స్కేల్ అమల్జేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు.

వికలాంగుల సమస్యలపై త్వరలో 'చలో అమరావతి'

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం కలెక్టరేట్ సమీపంలో ఉన్న జ్యోతిరావు పూలే పార్కు వద్ద ఆదివారం వికలాంగు లు ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. అంగవైకల్యంతో బాధపడుతున్న నిరుద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపో వడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అంగవైకల్యం శాపం కాకూడదని, సాధారణ రీతిలో బతుకు సాగించేందుకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు జిల్లాల వారీగా నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రిజర్వేషన్‌తో పాటు రోస్టర్ పాయింట్‌లో టాప్–10లో పెట్టాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, చదువుతో సంబంధం లేకుండా వికలాంగులకు పెళ్లికానుక రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి త్వరలో 'చలో అమరావతి' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాలో వికలాంగుల సంక్షేమ సంఘ నాయకులు, వికలాంగులు పాల్గొన్నారు.

టిడిపికి ఇదే చివరి మహానాడు

- అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపికి ఇదే చివరి మహానాడు అని ఎన్నికల అనంతరం టిడిపి కనుమరుగు కావడం ఖాయమని రాష్ట్ర జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. తాడేపల్లి వైసిపి పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి మీడియాతో ఆయన మాట్లాడారు. ఎన్‌టిఆర్ మరణానికి ప్రధాన కారకుడు చంద్రబాబేనని, ఎన్‌టిఆర్‌పై చంద్రబాబుకు ఏ మాత్రం గౌరవం లేదన్నారు. చంద్రబాబు పదవీ వ్యామోహం వల్లే ఎన్‌టిఆర్ మరణించారన్నారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న ఎందుకు తీసుకురాలేదని అంబటి రాంబాబు ప్రశ్నించారు. బాబు జీవితమంతా ప్రజలను మోసం చేయడమే అని మంత్రి పేర్కొన్నారు.

తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్‌టిఆర్ : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక నందమూరి తారక రామారావు అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. చరిత్ర మరువని నటనా కౌశలం, తెలుగు నుడి కారంపై మమకారం ఇలా మాట్లాడుకుంటే స్ఫురణకు వచ్చే ఒకే ఒక పేరు ఎన్‌టిఆర్ అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భాన అంజలి ఘటిస్తున్నానని తెలిపారు. తెలుగువారి 'ఆత్మగౌరవం' అనే నినాదంతో ఎన్నికల బరిలో నిలిచి అజేయమైన విజయం అందుకుని తెలుగువాడి సత్తా ఢిల్లీదాకా చాటారన్నారు. కాగా నూతన పార్లమెంటు భవనం భరతమాతకు మరో మణిహారం అని పవన్ తెలిపారు. పార్లమెంట్ భవన నిర్మాణంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరూ చరితార్థులుగా ఆయన పేర్కొన్నారు.

ఫారం నం.ఐఎన్‌సి–26
(రూల్ 30 ది కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014 ప్రకారం)
ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి కంపెనీ నమోదు కార్యాలయం మార్చుటకు వార్తాపత్రికలో ప్రకటన ప్రచురణ
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సౌత్ ఈస్ట్ రీజియన్ హైదరాబాద్, రీజినల్ డైరెక్టర్ ముందు కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్–సెక్షన్ (4) విషయంలో మరియు కంపెనీల (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, సబ్ రూల్ 30 యొక్క (5) యొక్క కంపెనీల (కార్పొరేషన్) రూల్, 2014 మరియు మెసర్స్. నైసా హోటల్స్ మరియు రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
(CIN: U93090AP2018PTC107821)
డో.నెం.13/43, ఎన్‌హెచ్–5, నిడమానూరు, విజయవాడ–520002, కృష్ణా, ఆంధ్రప్రదేశ్, ఇండియా వద్ద దీని రిజిస్టర్డ్ ఆఫీస్ ఉంది.
....పిటీషినర్
సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం" నుండి "తెలంగాణ రాష్ట్రానికి" తన నమోదిత కార్యాలయంను మార్చుటకు కంపెనీకి వీలుగా 25.05.2023న నిర్వహించిన అసాధారణ సర్వసభ్య సమావేశం వద్ద ప్రత్యేక తీర్మానాలు జారీ చేస్తూ మెమోరిండమ్ ఆఫ్ అసోసియేషన్ యొక్క ప్రత్యమ్నాయ నిర్ధారణ కోరుతూ కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 13 క్రింద కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తుచేయుటకు కంపెనీ ప్రతిపాదించింది.
కంపెనీ యొక్క నమోదిత కార్యాలయం యొక్క ప్రతిపాదిత మార్పు వలన ఏ వ్యక్తి ఆసక్తికైనా భంగం వాటిల్లుతుందని భావించిన యెడల వ్యతిరేకించుటకు గల ఆధారాలు మరియు అతని/ఆమె యొక్క ఆసక్తిని తెలియజేస్తూ, ఫైలింగ్ ఇన్వెస్టర్ కంప్లెయింట్ ఫారం ద్వారా మద్దతుగా అతని/ఆమె అభ్యంతరాలను ఎంసిఎ–21 పోర్టల్ (www.mca.gov.in) లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా రీజినల్ డైరెక్టర్ (సౌత్ ఈస్ట్ రీజియన్) కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్–500068, ఫోన్: 040 29804127, 29803127 (ఆ) ఇమెయిల్: rd.ser@mca.gov.in ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి పద్నాలుగు రోజులలోపు దరఖాస్తుదారు కంపెనీ కాపీని దాని రిజిస్టర్డ్ కార్యాలయంలో పైన పేర్కొన్న చిరునామాలో: నైసా హోటల్స్ మరియు రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్. తరపున
(CIN: U93090AP2018PTC107821)
సం/–
శ్రీరామ్ యలమాటి
డైరెక్టర్
డిఐఎన్: 01730013
రిజిస్ట్రర్డ్ ఆఫీస్ యొక్క పూర్తి అడ్రస్:
డి. నెం. 13/43, ఎన్.హెచ్–5, నిడమానూరు, విజయవాడ–520002, కృష్ణా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.
తేది: 27.05.2023
ప్రదేశం: విజయవాడ

రెజ్లర్లను అరెస్టు చేయడం దారుణం : ఎస్‌కెఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపి ఎంపి దుర్మార్గాలను నిరసిస్తూ ప్రజాస్వామ్యయుతంగా ఆందోళన చేపట్టిన రెజ్లర్లను, నిరసనకారులను అరెస్టు చేయడం దారుణమని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అరెస్టు చేసిన వారందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ తక్షణమే అరెస్టు చేయాలని కోరింది. ఇందుకోసం రెజ్లర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి మహిళలు, రైతులు పెద్ద ఎత్తున మద్దతు తెలియజేస్తున్నారని, ఇక ముందు కూడా వారికి అండగా ఉంటామని ఎస్‌కెఎం పేర్కొంది.

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD., through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd., వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: 02.06.2023 వ సమయం 10 గంటలకు CMS INFO SYSTEMS LTD. Ground Floor, Door No.4-4-156, Chandhra Mauli Nagar, 6th Length, Guntur - 522 007. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమ్మైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
NARSARAOPET BALAJI : NARS-41239, NARS-49354, NARS-27355, NARS-06845, NARS-72626.
For More Details, Call: Ramprasad Nandipati, Mob. 9246482477
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం

4 విజయవాడ
సోమవారం 29 మే 2023

చివరి రక్తపు బొట్టు వరకూ...

భుజాన మోయలేని భారం
తలపై ముళ్ల కిరీటం
కళ్లల్లో రేపటి ఆశల దీపం
వొంటినిండా వెలేసిన మచ్చలు
నా ముందు ముందు తరం నడిచిన అచ్చులు
అన్నీ తడుముకుంటూ తడుముకుంటూ...
సూర్యుడొస్తాడనీ ఓపికల్ని కూడగట్టుకొని
అడుగులేస్తున్న సుదూరపు బాటసారిని..!
మజిలీ మజిలీకి కాసింత ఓదార్పును తాగి
స్వేచ్ఛకోసం వెర్రి గొంతుల్ని విచ్చుకొని
విసిగి వేసారుతున్న వాణ్ని

మార్కెట్ మాయాజాలానికి
మనిషి తనాన్ని కోల్పోయి
నేనూ ఓ వస్తువునై అమ్ముడు పోతున్న వాణ్ని
ఈ కాంక్రీట్ కబంధ హస్తాలనుంచి
నన్ను నేను ఛేదించుకుంటూ
నాకు నేను పుటం పెట్టుకుంటూ..
ఎర్రపూల వనంలో మొలకెత్తుతున్న చైతన్యాన్ని

నా జీవన సంద్రం ఆటుపోటుల వలయం
నాలో ఎన్నో సునామీలు అన్నీ అన్నీ చూస్తూనే
వైయక్తికం నుంచి సామూహికం వైపు
ఓ పోరాట వీచికను సృష్టించక పోతానా అనీ..
ఓ అభ్యుదయ అగ్నికణాన్ని రగల్చక పోతానా అనీ..

గొంతెండీ కడుపెండీ కళ్లు బైర్లు కమ్మీ
అమ్మా ఆకలి అన్నప్పుడల్లా..
నా డప్పు డొక్కలో తన్నిన శబ్దమే
ఏ దండోరాలు ఏ మరణ మృదంగాలు
ఈ లేని తనాన్ని చాటింపు వేస్తాయి!?

అభి'మానం' అల్లాడి
ఆత్మాహుతికి దిగుతున్న నా దేశ మహిళల సాక్షిగా..
ఇప్పుడిక్కడ అంతా నిశ్శబ్దం..! కానీ,
ఆలోచనల్లో విస్ఫోటనం..
గుండెను పిండుతున్న అలజడి
ఆలస్యం చేయనిక మరిగే రక్తంలో దు:ఖాన్ని ఇంకించి
ఎండిన కళ్లల్లో ఎడారుల్ని అతికించి
నేనూ ఓ ఇసుక తుఫానునై అవినీతిని
అణువణువుగా చీల్చి ఆకాశంలోకి విసురుతాను
అదిగో, మానవత్వం ఓ సైకత చిత్రమై దూరంగా
దర్శనమిస్తోంది
చేజారిన హక్కుల్ని బలవంతంగానైనా పిండుకుంటాను
ఈ కర్ణుణ్ని ఏ గాయం మళ్లీ శపించినా..
ఎన్ని ఎండమావులు ఈ దాహార్తిని వెక్కిరించినా..
సమానత్వ ఉషస్సుల ఒయాసిస్సుల కోసం
నిత్యాన్వేషినై నేల నేలంతా నడుస్తూనే వుంటాను
నా చివరి రక్తపు బొట్టు వరకూ...!

– డా.కటుకోర్ళ్వుల రమేష్
99490 83327

కథా మార్గదర్శి కేతు విశ్వనాథరెడ్డి

నివాళి

ప్రసిద్ధ రచయిత, సాహిత్య విమర్శకులు కేతు విశ్వనాథ రెడ్డి భౌతికంగా మన నుంచి దూరమయ్యారు. ఒక ఆకు రాలినట్టు తన స్థానానికి సంబంధించిన స్పష్టమైన గుర్తును వదిలిపెడుతూ చప్పుడు చేయకుండా ప్రశాంతంగా వెళ్ళిపోయాడు. ఎన్నో చిగురుటాకులకు మార్గదర్శకంగా నిలిచిన వాడు. ఒక సంక్లిష్టమైన ప్రాంతీయతను సాహిత్యం చేసినవాడు నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. కరువులు, తాండవించే నేలల మీదుగా, కక్షల సుడిగాలులు చెలరేగే గ్రామాల వీధుల మీదుగా పయనించి కథా వస్తువుల్ని ఏరుకొన్నవాడు.. చెప్పా పెట్టకుండా దాటుకొన్నాడు. అపోహలకు, అపార్థాలకు గుర్రై, దగా పడిన ఈ సీమనేల మట్టి గుండెల చప్పుళ్ళను నిజాయితీగా వినిపించిన వాడు, ఎవరూ పట్టించుకోని దృశ్యాల్ని కూడేసుకొని, ఎవరూ వినేందుకు ఇష్టపడని మూలుగుల్ని గొంతుకలో మోసుకొని కథలుగా చెప్పినవాడు వెనుదిరిగి చూడకుండా కనుమరుగయ్యాడు.

ఏమి మనిషని ఆయన – ఎండిన కొమ్మల్ని తాళ్లుగా పేనిన వాడు, పొడి మట్టితో పూలను చేసినవాడు. ఏమి మనిషని ఆయన – నెత్తురూ కన్నీళ్లను కలిపి వాక్యాల్ని చేసినవాడు, ఆకలీ ఆవేశాల్ని కలిపి సంఘటనలు కూర్చిన వాడు. ఏమి మనిషని ఆయన – కాసిని నవ్వులు మరికొన్ని ఏడుపులు ఇంకొన్ని ఆవేశాలు చాలేన్ని చెమట చుక్కలు కలిపి కథలను వండినవాడు. ఏమి మనిషని ఆయన – మన చుట్టూ ఉండే మనుషుల్నే పాత్రలుగా మార్చి మన గుండెల్లో ప్రతిష్ఠించి వెళ్లినవాడు.

కథలంటే అవేవో బ్రహ్మ పదార్థాలనుకునేవాళ్లం. చిన్నచిన్న వ్యవసాయ కష్టాలు, కొట్లాటలు, రోజూ చూసే పార్టీల గొడవలు కథలుగా రాసి చూపించాడు. ఆయన కథలు చదివిన తర్వాత ఎవరికైనా సరే తమ చుట్టూ ఉన్న పరిసరాలని కథలుగా మలచుకొనే రహస్యం ఏదో తెలిసిపోతుంది. సింగమనేని, కె.సభా, పి.రామకృష్ణ, మధురాంతకం రాజారాం, పులికంటి, వైసివి లాంటి వాళ్లతో కలిసి సీమ ప్రాంతాన్నంతా కథాసాహిత్యంగా మార్చివేశాడు.

మా తరం వాళ్లకు కేతు విశ్వనాథ రెడ్డి గారు సాహిత్య గురువు. దారి దీపం. ఆత్మీయనేస్తం. తప్పుదారుల నడవకుండా హెచ్చరించే చూపుడు వేలు. అక్షరాలను ఆలంబనగా చేసుకుని పయనించిన కథక ఋషి. సాహిత్య విమర్శకుడు. వివిధ కథాసంకలనాల, పత్రికల సంపాదకుడు. పాఠ్యపుస్తకాల ప్రణాళికా కర్త. ఉపన్యాసకుడు. ఆయన మరణం సాహిత్య లోకానికి తీరని లోటు. రాయలసీమ ఆధునిక సాహిత్య వటవృక్షాలు ఇద్దరు – సింగమనేని నారాయణ గారు రెండేళ్ల క్రితం, కేతు విశ్వనాథరెడ్డి గారు ఇప్పుడు రాలిపోవడం సాహిత్య లోకం చేసుకున్న దురదృష్టం.

నాకు చెరో వైపు నిల్చొని వీపు తట్టి ప్రోత్సాహించిన వారు ఇద్దరూ. నా కథల సంపుటాలకు ఒకరు ముందుమాట రాస్తే, మరొకరు వెనక అట్ట మీద రాసి నా పట్ల తమ ఆప్యాయతను చాటుకొన్నారు. ఇద్దరితో కలిసి లెక్కలేనన్ని సభలూ సమావేశాల్లో పాల్గొన్నాను. ఎన్నో రాత్రిళ్ళు సాహిత్య చర్చల్లో కూచున్నాను. ఆహ్వానమున్నా లేకున్నా వాళ్లు పాల్గొనే సాహిత్య సభలకు విధిగా హాజరయ్యేవాన్ని. కేవలం వాళ్ల ఉపన్యాసాలు వినడానికి, వాళ్లతో కలిసి సాహిత్య సమయాల్లో గడపడానికి వెళ్ళేవాన్ని.

ఆయన ఆచార్యుడైనా, డాక్టరేట్ సంపాదించిన విద్యాధికుడైనా నాకెప్పుడూ పల్లెటూరి రైతులాగే కనిపించేవాడు. అదే కష్టజీవనం, అదే దాతృగుణం. ఆయన గొప్ప సాహిత్య కారుడైనా, ఉపన్యాసకుడైనా నాకెప్పుడూ పల్లె జీవితాల్ని గొంతెత్తి పాడే జానపద కళాకారుడిలాగే కనిపించేవాడు. అదే పట్టుదల, అదే అంకిత భావం. గ్రామ నామాల గుట్టు బైటబెట్టిన అరుదైన పరిశోధకుడైనా, విద్యార్థుల తల వెలిగేలా పాఠ్యపుస్తకాల్ని నిర్మాణం చేసిన భాషా శాస్త్రవేత్త అయినా నాకెప్పుడూ ఒక మాండలిక పదాల కుప్పలా కనిపించేవాడు. సంకోచపడని అదే యాస, అదే పలుకుబడి.

రాయలసీమ జీవితాల్ని ఇన్ని కోణాల్లో ఒడిసిపట్టి కథలుగా మలిచిన సాహిత్యకారుడు మరొకడు లేడనటం అతిశయోక్తి కాదు. సీమ జీవితం చాలా సంక్లిష్టమైంది. మూడు నాలుగేళ్ల వరసగా కరువులు వాలి, తినడానికి తిండి తాగడానికి నీళ్లు దొరక్క వరిటించి వరిటించి మొద్దు చింతమానుల్లాగా మొదళ్ళలో పానాలు నిలుపుకొని, ఒక్క వాన కురిస్తే చాలు ఒళ్లంతా చివురులు తొడిగి బతికి పోవడం వాళ్లకే తెలుసు. అంతటి కరువుల్లో కూడా ఆధిపత్యం కోసం మీసాలు మెలేసి గుంపును వెంటేసుకొని ఒకరినొకరు నరుక్కోవడం కూడా వాళ్లకే తెలుసు. బాటసారులు రాత్రిళ్ళు అరుగుల మీద కనిపిస్తే, గంప చేతబట్టుకుని ఇల్లిల్లూ తిరిగి అన్నం ముద్దలు సేకరించి వాళ్ల ఆకలి తీర్చటం, మాట పట్టింపు వస్తే కసి పెంచుకొని జీవితాంతం పగలు ప్రతీకారాలతో రగిలిపోవటం వాళ్ళకే తెలుసు. ఇంతటి సంక్లిష్టమైన జీవితాల్ని ప్రాంతీయ అవగాహనతో అర్థం చేసుకొని కథల్లోకి తీసుకురావడం అంత సులభమైన విషయమేమీ కాదు. వాళ్ళ ప్రవర్తనే కథయితే అదొక గొప్ప వైఫల్యం. దాని వెనక ఆర్థిక, సామాజిక, రాజకీయ కోణాలను విశ్లేషించినప్పుడే గొప్ప కథవుతుంది. కేతు గారు అందులో సఫలమయ్యారు కాబట్టే గొప్ప కథకులు కాగలిగారు. ముడి విప్పలేని సంక్లిష్ట విషయాల్ని సైతం అలవోకగా కథలుగా మార్చిన నైపుణ్యం ఆయనది. మేమంతా సులభంగా నడిచేందుకు దారులు ఏర్పరిచిన మార్గదర్శకుల్లో అగ్రగణ్యులు ఆయన.

ఈ పెద్దాయన కోపగించుకుని మాట్లాడటం నేనెప్పుడూ చూడలేదు. ఎప్పుడైనా ఎవరికైనా ఆయన నవ్వు మొహంతోనే కనిపించేవాడు. హాస్య చతురత ఆయన స్వంతం. ఎంతటి గంభీరమైన వాతావరణాన్నైనా ఒక చతురు మాటతోనో, ఒక నవ్వు సంఘటనతోనో తేలికపరిచేవాడు. ప్రతి మనిషిని గుండెలోతులు స్పృశించేలా పలకరించేవాడు. నన్నందరూ 'సన్నపురెడ్డి' అని పిలిచినా, ఆయన మాత్రం 'వెంకట్రామ్' అంటూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని వీపు తట్టేవాడు. రచయితగా నా గమనాన్ని సునిశితంగా పరిశీలించి సలహాలిచ్చేవాడు. పొగడ్తలకు పొంగకుండా, తెగడ్తలకు కుంగకుండా నా పని నేను చేసుకుపోయే స్థితప్రజ్ఞత సింగమనేని గారు, కేతుగారి వల్లనే నాకబ్బింది.

రాయలసీమకు సంబంధించిన అన్ని సమస్యల మూలాల్ని వెదకి పరిష్కారాల్ని సూచించిన నిఖార్సైన కథకులు కేతు విశ్వనాథరెడ్డి గారు. ప్రాంతీయ జీవితాన్ని చిత్రిస్తూనే, ప్రాంతాలకు అతీతమైన సంస్కారాన్ని చైతన్య స్ఫూర్తిని భావోద్వేగాలని రగిలిస్తూ మానవ స్వభావాల్ని సమర్థవంతంగా ఆవిష్కరించిన అరుదైన కథకులు. ఆయన మన నుంచి దూరమైన సందర్భంగా అశ్రు నయనాలతో అంజలి ఘటిస్తున్నాను.

– సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి

"ముగ్గురు వ్యక్తులు
సంస్కృతిని నిర్మిస్తారు.
శాస్త్రకారుడు, కళాకారుడు, శ్రామికుడు.

– మాక్సింగోర్కి

సోషల్ మీడియా పోస్ట్

రాజదండాలు రాజ్యమేలు కాలంలో
జాతీయజెండాలు కాళ్ళకింద నలిగిపోతాయి.

రాచరిక చిహ్నాలు పట్టపు గౌరవం పొందే నేలలో
దేశానికి పతకాల ఖ్యాతి తెచ్చినవాళ్ళు నడి రోడ్డు మీద ఈడ్చబడతారు.

4న 'యుద్ధమే శాంతి' పరిచయ సభ

ప్రసాదమూర్తి దీర్ఘకవిత 'యుద్ధమే శాంతి' పరిచయ సభ జూన్ 4 (ఆదివారం) ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం కథానిలయంలో, సాయంత్రం 5 గంటలకు విశాఖపట్నం పబ్లిక్ లైబ్రరీలో జరగనుంది. అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షత వహిస్తారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి రుంకు అప్పారావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. బొర్రా గోవర్ధన్, ఆచార్య చల్లపల్లి స్వరూపరాణి దీర్ఘ కవితను పరిచయం చేస్తారు. గంటేడ గౌరునాయుడు, మల్లిపురం జగదీష్, మాటూరి శ్రీనివాస్, సియ్యార్కె, ఎస్ఆర్ వేమన, దుర్గారావు తదితరులు పాల్గొంటారు.

– సిక్కోలు బుక్ ట్రస్ట్

పాలపిట్ట కథల పోటీ ఫలితాలు

అరిశా సత్యనారాయణ – ఆదిలక్ష్మి గార్ల జ్ఞాపకాల స్ఫూర్తితో పాలపిట్ట నిర్వహించిన కథల పోటీకి మూడు వందలకు పైగా కథలు వచ్చాయి. ఇది తెలుగునాట కథారచన విస్తృతిని తెలియజేస్తోంది. కథావస్తువులో వైవిధ్యం అపారంగా ఉంది. పలు దఫాలుగా చదివిన తరువాత కథల ఎంపిక జరిగింది. మొదటి బహుమతి: గీతలు చెడిపి... – శాంతినారాయణ; రెండో బహుమతి: తోడు – టి.వి.ఎల్. గాయత్రి; మూడో బహుమతి : ఈతరం కథ – కోటమర్తి రాధా హిమబిందు. ప్రత్యేక బహుమతులు : 1. సీతపిన్ని – కపాకర్ పోతుల, 2. మౌనం రాగమైన వేళ! – నాదెళ్ల అనురాధ, 3. పగటి చూపు – జడా సుబ్బారావు, 4. తోడేళ్ళు – సాగర్ల సత్తయ్య, 5. మంచితనం – గన్నవరపు నరసింహమూర్తి పొందారు.

– గుడిపాటి, ఎడిటర్, పాలపిట్ట

'కొడిగట్టిన సూర్యుడు' ... పదచిత్రాల పరిమళాలు

సందర్భం

కలం, కుంచె ఈ రెండింటితో తెలుగు సాహిత్యాన్ని వెలిగించిన కవి, శీలా వీర్రాజు. బహుముఖ ప్రజ్ఞావంతులైన వీరు అనేక కథలు, కావ్యాలు, చిత్రకళ గ్రంథాలు, వ్యాస సంపుటాలు రచించారు. అనేక ప్రయోగ కవితలు కూడా ఆయన చేతిలో అందంగా రూపుదిద్దుకొన్నాయి. వచన కవితా పితామహుడు కుందుర్తి కథ, నవల, నాటిక, ఆత్మకథ అన్నిటినీ వచన కవితాప్రక్రియలోనే రాయాలని అన్నారు. అలా అని ఊరుకోవడమే కాక తామే స్వయంగా అన్ని వాటినీ వచన కవితలోనే రచించారు.

శీలా వీర్రాజు కూడా అదే బాటలో పయనించారు. కొడిగట్టిన సూర్యుడు, ముళ్ళరెమ్మ, విశ్వాసం నీడకింద, అద్దాల గుహ, హృదయం దొరికింది, అద్దె గది అనే వచన కవిత్వ కథల సంపుటాలను రచించారు. వెలుగురేఖలు, కాంతిపూలు, మైనా, కరుణించని దేవత, మొదలైన నవలలను; హృదయం దొరికింది, మళ్ళీ వెలుగు, కిటికీ కన్ను, ఎర్రడబ్బా రైలు, మొదలైన కవితా సంపుటాలను; Window Scape (తెలుగు కవితల ఆంగ్లానువాదం) కలానికి అటూ ఇటూ అనే వ్యాస సంపుటిని, శిల్పరేఖ (లేపాక్షి స్కెచ్‌బుక్)ను ప్రచురించారు.

వీర్రాజు గారు చిత్రకారులు కనుక ఆయన పుస్తకాలకు ఆయనే కవరు పేజీలు చిత్రీకరించుకొనేవారు. అనేక కవుల కావ్యాలకు కూడా ఆయన ముఖపత్ర చిత్ర రచన చేశారు. కళాహృదయులైన వారి ఇల్లు కూడా ఎంతో కళాత్మకంగా ఉంటుంది. అందమైన చిత్రాలతో, శిల్పాలతో ఒక మ్యూజియంలా ఉంటుంది.

సంతకం అక్కరలేని శైలి వీర్రాజు గారిది. కథారచనలో సందర్భానుసారంగా చేసిన వర్ణనలు చేయి తిరిగిన చిత్రకారుడు చిత్రించిన రంగుల చిత్రాల్లా అందంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. ఆయన రచనల్లో దేన్ని తీసుకున్నా, వర్ణనలు చదివినపుడు, ఎంతో సహజంగా, సరళసుందరంగా ఉంటాయి. పదచిత్రాలు జవసత్వాలు ఉట్టిపడుతూ సజీవ దృశ్యాల్లా సంచలనం కలిగిస్తాయి.

వీర్రాజు గారి వచన కవిత్వ కథాసంపుటిలో ప్రముఖమైనది కొడిగట్టిన సూర్యుడు. ఈ కథలో ప్రధాన పాత్రధారులు కృష్ణవేణి, పార్వతీశం. కృష్ణవేణి ఆసుపత్రిలో పనిచేసే నర్సు... రోడ్డు మీద ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చేరిన పేషంట్ పార్వతీశం. కృష్ణవేణిని వర్ణిస్తూ కవి ఒక దృశ్యచిత్రాన్ని పాఠకుల కళ్ళముందు నిలబెడతారు.

"కృష్ణవేణి పేరుకు తగ్గట్టు నిజంగా నీలవేణి
చీకటి ఆమె తలమీద గడ్డకట్టి కరిగి పారినట్టు
పొడుగ్గా చీకటి జలపాతంలా ఉరికిన పెద్ద కురులు
ఆ కురుల ఉరుకుల్ని ఆనకట్టలో బంధించినట్టు
చుట్ట చుట్టి నర్సు టోపీలో బిగించింది ఆమె"

మామూలుగా కవులు అందమైన అమ్మాయిలనే అభివర్ణిస్తారు. కృష్ణవేణి అందమైనది కాదు. "ఆమె అందమైనది కాదని / ఆమె కంఠం పిడికిలిలో ఇమడగలదు/ అయినా అది సౌందర్యపు ఖండం కాదు/ అక్కడన్నీ గోతులు, ఆ మధ్య పొడుచుకొచ్చే ఎముకలు / ఆ దిగువ యౌవనం హరించుకుపోయిన వక్షాలు" అని ఆమె అంద విహీనతను వర్ణిస్తూ 'ఏ ఆకర్షణా లేని ఏ రంగులూ వొదలని గడ్డిపువ్వు ఆమె' అని అంటారు.

కథారచనలో అయితే అంతా వచనంలో సాగిపోతుంది. ఇక్కడ ప్రతిదాన్నీ కవిత్వంలో చెప్పాలి గదా! ఒకరోజు సాయంకాలం ప్రమాదానికి గురైన పార్వతీశం హాస్పిటల్‌కు వస్తాడు. అతని రాకను గురించి వారం రోజుల కిందట ఓ బద్ధకపు సాయంకాలం చివర నల్లటి కలువలా చీకటి మరీ బద్ధకంగా విచ్చుకుంటున్నప్పుడు / గాలికి రేకల మీదకు జారిన పుప్పొడి నక్షత్రాలై మెరుస్తున్నప్పుడు/ రంగురంగుల సీతాకోకచిలుకలు రెక్కల్లాంటి కోరికలతో ఎగిరి / పుష్పమకరందాన్ని మత్తుగా గ్రోలుతూ ఆమె కలలు కంటుండగా/ ఆమె కలల అంచుల మీద ఉదయిస్తోన్న ఎర్రటి సూర్యుడి లాగ / రక్తపు ముద్దలాంటి ముడుచుకుపోయిన పార్వతీశాన్ని/ నలుగురు సాయంపట్టి మెట్ల మీంచి పైకి తీసుకొచ్చారు' అని వర్ణిస్తారు. రోడ్డు ప్రమాదంలో గాయపడడాన్ని 'రక్తపుముద్దలాంటి అనే పదంతో చిత్రీకరిస్తారు.

పార్వతీశం నర్సుతో "డైరీ పేజీల మధ్య నా చిరునామా రాసిన కార్డు ఉంది. దానిలో నా చావురాసి పోస్టు చెయ్యండి. ఇంతకన్నా మీ నుంచి నేను కోరుకునేది ఏదీ లేదు' అంటాడు. అది చదివి కృష్ణవేణి బాధపడుతుంది. నిరాశలో కూరుకుపోతున్న అతనికి ధైర్యం చెపుతుంది. గాయాల బాధతో పార్వతీశం బాధను మరిచిపోయి నిద్ర పోవాలంటే మార్ఫియా ఇమ్మంటాడు. అప్పుడు ఆమె మార్ఫియా సీసాలో మూడవవంతు మందును సిరంజిలో ఎక్కించి అతనికి ఇంజక్షను చేస్తుంది. దానికి పార్వతీశం సంతృప్తి పడకుండా 'మరికాస్త దయ చూపాలి మీరు/ మూడోవంతు మందుతో నిద్రను కొనుక్కోలేను నేను" అంటాడు. ఇంతకంటే ఎక్కువిస్తే ప్రమాదం అంటుంది.

కోరికలకు తావివ్వకుండా నిరాశలోనే బతుకుతున్న కృష్ణవేణి పార్వతీశాన్ని చూసి ఆశ పెంచుకుంటుంది. అతని మీద అభిమానంతో పళ్ళు కొనిస్తుంది. పార్వతీశం ఆనందిస్తాడు. ఆ రోజు రాత్రి ఆనందంతో, జీవితం మీద ఆశతో మత్తుగా నిద్రపోతుంది. ఆ రాత్రే తలుపులు కొడుతూ ఒకటే శబ్దం. పార్వతీశం నొప్పుల్ని భరించలేకపోతున్నాడు. రమ్మని వార్డుబాయ్ పిలుస్తాడు. ఆ నిద్రమత్తులోనే తూలుతూ లేచి వెళ్ళి, పార్వతీశానికి మార్ఫియా ఇస్తుంది. తెల్లారి లేచేసరికి నిర్జీవి ఐన పార్వతీశం. టేబుల్ మీద మార్ఫియా సీసాల్లో ఖాళీ అయిన ఒక సీసా దీనంగా కనిపిస్తుంది.

ఇదీ, వచన కవిత్వంలో చెప్పిన కథ. వచన కవిత్వ కథ అయినప్పటికీ దీనిలో అర్థం కాకపోవడం ఏమీ ఉండదు. మానవ హృదయంలోని ఆలోచనలను, అనుభూతులకు చిత్రం పట్టిన రచనలు వీర్రాజు గారి కథలు. మధ్య తరగతి స్త్రీ పురుషుల అంతరంగాలు, వాటిలోని బడబాగ్నులు, కోరికలు, కలలు, ఆశలు, నిరాశలు, మోహాలు, వ్యామోహాలు అన్నిటినీ ఫొటో తీసినట్లు చిత్రించిన కథలివి. కోరికలు నెరవేరక, నిరాశలోనే, జీవిస్తూ తనను ప్రేమించే వాళ్ళొకళ్ళుంటే చాలు; జీవనవనంలో వసంతం చిగురిస్తుంది అని ఆశ పెట్టుకుంటుంది కృష్ణవేణి. కానీ నిరుత్సాహం, నిరాశల చీకట్లోకి చూడడానికి అలవాటు పడిన కళ్ళు ఆశల వెలుతురులను చూడలేవు. కలల సూరీడు తొంగిచూడడు. అలాటి దురదృష్ట వంతులకు ఆఖరికి కొడిగట్టిన సూర్యుడే మిగులుతాడు. ఈ ఇతివృత్తాలే పాఠకుల గుండెల్లో నాటుకొనేటట్లు రాశారు కవి.

శీలావీ గారి రచనల్లో క్లిష్టపదాలు, అన్వయ దోషాలూ ఉండవు. మైదానంలో ప్రవాహంలా సాఫీగా, సరళంగా సాగిపోయే శైలి. ఉక్కిరి బిక్కిరి కలిగించకుండా, హాయిగా అలలపై కదిలే పడవలా రచన సాగిపోతుంది. అద్భుతమైన వర్ణనలతో, అపురూపమైన ఉపమలతో చక్కని పదచిత్రాలతో గూడిన శైలి ఆయన సొంతం.

ఈ కవిత్వ కథలో చీకటిని ఎలా వర్ణిస్తారో చూడండి. "బయటంతా విషాదంలా చిక్కటి చీకటి/ ఆదామూ అవ్వల పాపంలో పుట్టి పెరిగి/ విశాలమైన వటవృక్షంలా విస్తరించి / లోకాన్ని చుట్టుముట్టిన దట్టమయిన చీకటి/ శ్మశానంలో వెలుగులు హరించిన వర్షరాత్రి" ఇలా ఉపమలు చెప్పుకుంటూపోతే అంతు ఉండదు. "కాటుక కళ్ళ పెళ్ళి కూతురి కన్నీటిలో కరిగిన/ కొత్త మాంగల్యపు నుసిముద్దలాంటి చీకటి" అన్న ఉపమానం ఎంతలోతైనది! ఎంత కొత్తది! చాలామంది మాంగల్యాన్ని సంప్రదాయానికి ప్రతీకగా చెప్తారు. కానీ ఇక్కడ స్త్రీ జీవితంలోని విషాదానికి, చీకటికి ప్రతీకగా వర్ణించడం ఎంత అద్భుతం.

ఈ కావ్యం నిండా వాక్యాలు కవిత్వ పరిమళంతో గుబాళిస్తాయి. "రగుల్కొన్న ఆకలి చిచ్చుల్ని మొదలంటా ఆర్పి / గుండెలోతుల్లోకి జారి, మూలమూలల్లోకి యింకి, ఆశ ధైర్యాలు ఎద్దుల్ని చేసి, అరక సిద్ధం చేసి/ అతను పండించనున్న కలల పంటకు సుక్షేత్రాన్ని సిద్ధపరిచింది". ఆశ, ధైర్యాలను ఎద్దులతో పోల్చడం అరక సిద్ధం చేసి కలల పంట పండించడానికి క్షేత్రాన్ని సిద్ధం చేయడం ఇలాంటి ఈ వాక్యాల్లోని కొత్తదనం పాఠకుణ్ణి ఆకర్షిస్తుంది. నిశ్శబ్దపు వల్మీకం, జ్ఞాపకాల చలిచీమలు, తపస్సమాధి, జ్ఞాపకాల తీగలు, చీకటి వర్షం, నిశ్శబ్దపు మొక్కలు, చీకటి జలాలు, కలల పంచకల్యాణి, వెలుగుకొమ్ములు, పలకరింపుల చన్నీళ్ళు, నిద్రమత్తు దీపాలు, నర్సాంత్యపురం, బద్ధకం మనసు మొదలైన రూపకాలు మనసుకు గిలిగింతలు పెడతాయి.

"వర్ణనానిపుణ:కవి" వర్ణనానైపుణ్యం కలవాడే కవి అని ప్రాచీన అలంకారికులు అంటారు. చక్కని వర్ణనలతో, లోతైన భావనలతో, విషాదాంత ముగింపుతో ఈ కావ్యం పాఠకుల హృదయాలపై బలమైన ముద్ర వేస్తుంది.

శీలావీ గొప్ప మానవతావాది. నా పుస్తకం నిషిద్ధాక్షరికి ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు వచ్చినప్పుడు వారి ఇంట్లోనే ఉన్నాను. మా ఊరికి వెళ్ళిపోతుంటే మోకాళ్ళ నొప్పైనా కిందకు దిగివచ్చి బస్సు వచ్చిందాకా వుండి బస్సు ఎక్కించి వెళ్ళారు. అంత నిరాడంబరులు, నిగర్వి, మనుషుల అంతస్థుల బట్టి కాకుండా అక్షరాలను బట్టి ఆదరించే గొప్ప మనీషి. వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ, వారి స్మృతికిదే నా అక్షర నివాళి.

పుస్తకం మొదటి నుంచి చివరివరకు అందమైన పదచిత్రాలతో మనసును ఆకట్టుకుంటుంది. ఒకదాని తర్వాత ఒకటి దృశ్యాలు దృశ్యాలుగా ఆవిష్కరింప బడుతూ అలౌకికానందానుభూతిని కలిగిస్తాయి. సుకవి జీవించు ప్రజల నాల్కల యందు అన్నట్లు పుస్తకం చదవడం అయిపోయాక కూడా అంతరంగంలో అలజడి కలిగిస్తుంది ఈ కావ్యం.

(జూన్ 1 : శీలా వీర్రాజు ప్రథమ వర్ధంతి)

– మందరపు హైమవతి

కాల జ్ఞానం

ఎన్నేళ్ళు ఎన్ని ఎన్నికలు జరిపినా
ఏ కార్పొరేట్ల పార్టీ అధికారం చేపట్టినా
కష్టజీవుల కడుపు సంచిని సగం కత్తిరించి
సగానికే 'సంక్షేమం' లేపనం రాశారు
అమ్మ భారతికి అబద్ధాల హారతులిస్తూ
గద్దెలన్నీ పెట్టుబడులకు కాపలాలు కాశాయి
నిజాలను ఎంత లోతులో పాతి పెట్టినా
అవి మొలకెత్తకుండా ఎంత కాలం ఆపగలరు?
నిజం ... నిజమే చెబుతున్నా
ఎన్ని అరచేతులు అడ్డుపెట్టినా
కలకాలం సాగదు
ఈ పెట్టుబడుల కోలాటం
పండరి భజనల కులుకు నృత్యం

కాలం కడుపు
సోషలిజాన్ని ప్రసవించిన రోజు
కష్టజీవులు కిరీటాలతో వస్తారు
వృత్తిదారులు కొత్త దుస్తులు ధరిస్తారు
మధ్య తరగతి
మంగళ వాయిద్యాలు వాయిస్తుంది
వ్యాపార వర్గాలు
పూల రథాలతో స్వాగతిస్తాయి
ఇది తట్టుకోలేక కార్పొరేట్లు
కత్తులతో తలలు నరుక్కు చస్తారు
సూర్యుడు మండే ఎండతో
తెగిపడిన తలలకు చితులు వెలిగిస్తాడు
కాలం దొర్లి కొత్త వ్యవస్థలో కొలువు దీరుతుంది

– ఉన్నం వెంకటేశ్వర్లు
87900 68814

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.
అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా
prajasavvadi@gmail.com

శత సాహితీ సమావేశాల 'రా.ర.వే'

రాజాం రచయితల వేదిక (రా.ర.వే) ముగ్గురు మిత్రుల ఆలోచనతో మొలకెత్తిన సాహితీ సంస్థ. 'సాహిత్యము, సమాజము రెండు కళ్ళు' అనే మూల సూత్రంతో 2015 జనవరి 25వ తేదీన ఉత్తరాంధ్రకు చెందిన రాజాం అనే చిన్న పట్టణంలో ఆవిర్భవించింది. నేడు ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకొని, ఉత్తమ సాహితీ విలువలను పరివ్యాప్తి చేస్తూ 100వ సమావేశం జరుపుకుంటోంది. దీనిని కవి, రచయిత, అనువాదకుడు, విమర్శకుడు గార రంగనాథం నడిపిస్తున్నారు.

కొన్ని సాహిత్యాంశాలను ముందుగానే నిర్ణయించుకొని, ప్రతి నెలా ఒక సాహిత్యవేత్తను ఆహ్వానించి, వారితో ముఖ్య ప్రసంగం ఇప్పించడమే ప్రధాన లక్షణంగా రా.ర.వే సాగుతోంది. ప్రాచీన సాహిత్యము, ఆధునిక సాహిత్యము అనే భేదం లేకుండా అన్ని ప్రక్రియల్లో వచ్చిన మంచి సాహిత్యాన్ని ప్రజలకు చేరవేయడమే ప్రధాన కర్తవ్యంగా భావిస్తోంది. వక్తల ముఖ్య ప్రసంగం పూర్తయిన తరువాత రా.ర.వే సభ్యులు స్వీయ రచనలు వినిపించడం ఆనవాయితీ. నిర్వాహకునితో పాటు గురుగుబిల్లి జగన్నాథరావు, ఒమ్మి రమణమూర్తి, నేతేటి గణేశ్వరరావు, డా:ఆల్తి మోహనరావు, బొంతు సూర్యనారాయణ, పిళ్లా తిరుపతిరావు, పొదిలాపు శ్రీనివాసు, కుదమ తిరుమలరావు, పడాల కవీశ్వరరావు, ఉరిటి గున్నేశ్వరరావు, పోలాకి ఈశ్వరరావు మొదలగువారు పద్య, వచన కవులు, వ్యాస రచయితలు, కథకులుగా గుర్తింపు పొందుతున్నారు.

వేదిక స్థాపించిన మూడేళ్లలో నందనందనము, పరిమళ భావ తరంగాలు, తరంగ ధ్వానాలు అనే మూడు పుస్తకాలను సంస్థ ముద్రించింది. నాలుగో వార్షికోత్సవంలో బాలసాహితీ సదస్సు నిర్వహించారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. రంగనాథం సంపాదకత్వంలో 'సాహితీ సౌరభాలు' అనే 17 వ్యాసాల గ్రంథాన్ని 'ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి' అచ్చు వేయించింది. సంస్థ ఐదో వార్షికోత్సవంలో జరిగిన ఈ గ్రంథ ఆవిష్కరణ సభకు ముఖ్య అతిథిగా శాసనసభ పూర్వ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ వచ్చారు. సమితి పూర్వ సంచాలకులు దీర్ఘాశి విజయ భాస్కర్ ఆ పుస్తక పరిచయం చేశారు. ప్రముఖ కథా, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడు రచించిన 'బహుళ' నవలను ఆరవ వార్షికోత్సవంలో డా: డి.వి.జి శంకరరావు ఆవిష్కరించారు. గత ఏడాది మే 29న ఏడవ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆ సభలో పిళ్లా తిరుపతిరావు 'ఆజిరి' సాహిత్య వ్యాసాల సంపుటిని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఆవిష్కరించారు. ప్రముఖ విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య పుస్తక పరిచయం చేశారు. ఈ వేదికపై దాసరి రామచంద్రరావు 'అల్పపీడనం' గంటేడ గౌరునాయుడు 'సేద్యగాడు' పద్యకావ్యం వంటి పుస్తక పరిచయ సభలు జరిగాయి. శ్రీ కృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధంపై సామాజిక కోణంలో రంగనాథం రచించిన 374 పుటల 'రాయరత్న మంజూష' విమర్శనాత్మక ఉద్గ్రంథాన్ని గుంటూరుకు చెందిన బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ప్రచురించింది. ఈ పొత్తం ఆవిష్కరణకు ప్రముఖ సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఎనిమిదో వార్షికోత్సవంలో రంగనాథం సంపాదకత్వం వహించిన 'విస్మృత కళింగాంధ్ర సాహితీ ప్రభ' అనే 30 వ్యాసాల గ్రంథాన్ని డా. దామెర వెంకట సూర్యారావు ఆవిష్కరించారు. ప్రముఖ వైద్యులు డా: కణుగుల సుధీర్ ఆర్థిక సహాయంతో ఈ గ్రంథ ముద్రణ జరిగింది.

2023 మే 28 ఆదివారం రాజాంలోని శ్రీ విద్యానికేతన్ స్కూల్లో రా.ర.వే 'శత సాహితీ సమావేశ సంబరాలను జరుపుకుంది. ఈ సందర్భంగా రంగనాథం యొక్క 150 సూక్తి శ్లోకాలకు, 150 ఆటవెలది పద్యానువాదాల 'సూక్తి రత్న మంజరి'ని సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ ఆవిష్కరించారు. వేదిక నిరంతరంగా స్థానికంగా ఉన్న ప్రతి కళాశాలలో 'తెలుగు మాట– వెలుగు బాట' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, విద్యార్థులకు మాతృభాషపై మమకారం కలిగేలా చైతన్య పరుస్తోంది. మున్ముందు మరిన్ని కార్యక్రమాలతో పురోగమించాలని ఆశిద్దాం.

– జానకి,
94417 16658

రెజ్లర్లపై దాష్టీకం

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపి, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలంటూ పోరాడుతున్న రెజ్లర్లు, వారికి మద్దతు తెలిపిన మహిళా, రైతు సంఘాలపై కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు దమనకాండకు పాల్పడ్డారు. బ్రిజ్‌భూషణ్ పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవానికి హాజరు కాగా.. ఆందోళన నిర్వహిస్తున్న రెజ్లర్లపై పోలీసులు విరుచుకుపడ్డారు.

అంబరాన్నంటిన ఓ తండ్రి ఆనందం

- అమ్మాయి పుట్టిందని ఏనుగుపై ఊరేగింపు

ముంబయి : తమ కుటుంబంలో 35 ఏళ్ల తర్వాత ఆడపిల్ల పుట్టింది. ఆ ఆనందంతో తండ్రి.. కుమార్తెను ఏనుగు మీద ఊరేగించాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లా పచ్‌గావ్‌లో నివసించే గిరీశ్ పాటిల్‌కు అయిదు నెలల క్రితం కూతురు పుట్టింది. ముద్దుగా ఆమెకు 'ఐరా' అని పేరు పెట్టుకున్నారు. తొలిసారిగా శనివారం ఆ చిన్నారిని తన ఇంటికి తీసుకురాగా.. ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఆమెకు గిరీశ్ ఘనస్వాగతం పలికాడు. ఏనుగుపై ఊరేగిస్తూ డప్పు వాయిద్యాల మధ్య ఇంటికి తీసుకువెళ్లాడు. చాలా ఏళ్ల తరవాత తమ ఇంట కూతురు పుట్టిందని పాటిల్ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో స్వల్ప ప్రకంపనలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీతోపాటు పరిసర ప్రాంతాల్లో స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపం సంభవించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 11.23 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూప్రకంపనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఢిల్లీతో పాటు పంజాబ్, హర్యానా, చండీగఢ్ ప్రాంతాల్లోనూ ప్రకంపనలు వచ్చాయి. ఎలాంటి నష్టం జరుగలేదని చెప్పారు.

ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ప్రకారం.. ఆదివారం ఉదయం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఫైజాబాద్ సమీపంలో 5.2 తీవ్రతతో భూకంపం సంభవించిందని తెలిపింది. ఫైజాబాద్‌కు దక్షిణాన 72 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని వెల్లడించింది. భూ అంతర్భాగంలో 220 కిలోమీటర్ల లోతులో ప్రకంపణలు చోటుచేసుకున్నాయని పేర్కొంది.

రేపటి నుండి అమెరికాలో పర్యటించనున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం నుండి అమెరికాలో పర్యటించనున్నారు. వాషింగ్టన్ డిసి, న్యూయార్క్, శాన్ ఫ్రాన్సిస్కోలో జరుగనున్న సమావేశాలకు ఆయన హాజరుకానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆయా నగరాల్లోని యూనివర్సిటీ విద్యార్థులతో చర్చిస్తారని, భారతీయ అమెరికన్లను ఉద్దేశించి ప్రసంగిస్తారని అన్నారు. అలాగే అమెరికా చట్టసభ సభ్యులతో సమావేశమవుతారని, థింక్ ట్యాంక్ సభ్యులు, వాల్ స్ట్రీట్ ఎగ్జిక్యూటివ్‌లు, యూనివర్సిటీ విద్యార్థులతో కూడా ఆయన చర్చలు జరుపుతారని ఆవర్గాలు తెలిపాయి.

మూడేళ్ల గడువుతో కూడిన సాధారణ పాస్‌పోర్ట్ కోసం ఢిల్లీ కోర్టు నో అబ్జెక్షన్ పత్రం (ఎన్‌ఒసి)ని శుక్రవారం జారీ చేసిన సంగతి తెలిసిందే. పరువునష్టం కేసులో రెండేళ్ల జైలుశిక్ష విధించడంతో ఈ ఏడాది మార్చిలో లోక్‌సభ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసింది. అనంతరం ఆ శిక్షను కోర్టు సస్పెండ్ చేసింది. దీంతో దౌత్యపరమైన పాస్‌పోర్ట్‌ను సరెండర్ చేశారు. పదేళ్ల గడువుతో కూడిన సాధారణ పాస్‌పోర్ట్ కోసం ఆయన దరఖాస్తు చేశారు. అయితే నేషనల్ హెరాల్డ్ కేసులో విచారణను ఎదుర్కొంటున్నందున బిజెపి నేత సుబ్రమణ్యస్వామి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మూడేళ్ల గడువుతో కూడిన ఆర్డినరీ పాస్‌పోర్ట్‌ను జారీ చేయనున్నట్లు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ (ఎసిఎంఎం) వైభవ్ మెహతా పేర్కొన్నారు.

పాకిస్తాన్‌లో హిమపాతం విరుచుకుపడి 11మంది మృతి

పాకిస్తాన్ : పాకిస్తాన్‌లో శనివారం ఘోర ఘటన జరిగింది. ఆక్రమిత గిల్గిట్-బాల్టిస్తాన్ హిమాలయ పర్వత ప్రాంతంలోని ఆస్టోర్ జిల్లాలో షంటర్ టాప్ ప్రాంతంలో హిమపాతం విరుచుకుపడటంతో... 11 మంది మరణించారు. మరో 25 మంది గాయపడ్డారు. గుజ్జర్ కుటుంబానికి చెందిన 25 మంది పిఒకె నుంచి ఆస్టోర్‌కు తమ పశువులతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటనా స్థలానికి పాకిస్తాన్ ఆర్మీ రెస్క్యూ బృందం చేరుకుంది. హిమపాతం కింద చిక్కుకున్న మతదేహాలను వెలికితీసేందుకు స్థానిక ప్రజల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. గాయపడినవారిలో 13 మందిని ఆస్టోర్‌కు తరలించారు. వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు పాక్ మీడియా వెల్లడించింది.

ఈ ఘటనలో ప్రాణనష్టంకు సంబంధించి గిల్గిత్-బాల్టిస్థాన్ ముఖ్యమంత్రి ఖలీద్ ఖుర్షీద్ ఖాన్, పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.

దేశాన్ని వెనక్కి తీసుకెళుతున్నారు

కేంద్రం తీరుపై ప్రతిపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా నూతన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవం, అక్కడ వన్‌మేన్ షో నిర్వహించడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్‌సిపి చీఫ్ శరద్ పవార్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఉదయం తాను ఈ కార్యక్రమాన్ని చూశానని, తాను అక్కడికి వెళ్లకపోవడం పట్ల సంతోషంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జరిగింది చూసి తాను కలత చెందానని అన్నారు. ఈ కార్యక్రమం కేవలం కొద్ది మందికే పరిమితమా అని పవార్ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు లేకుండా నూతన పార్లమెంట్ భవనం ప్రారంభించడంతో ఇది పరిపూర్ణ కార్యక్రమం కాదని ఎన్‌సిపి నేత సుప్రియ సూలే వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి చోటు లేదని ఈ అంశం తేటతెల్లం చేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని రాజులా వ్యవహరిస్తూ పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవాన్ని తన పట్టాభిషేక కార్యక్రమంలా భావిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. భారత్ అంటే రాజు, ప్రజలే

మోడీ తీరుపై సీతారాం ఏచూరి ట్వీట్

పార్లమెంట్ భవన ప్రారంభోత్సవ సందర్భంగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్న తీరుపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'భారీ ప్రచారార్భాటం మధ్య పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. 'కొత్త పార్లమెంట్.. కొత్త ఇండియా' అంటూ ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి గైర్హాజరు, ప్రతిపక్ష పార్టీల నిరసనల మధ్య కొత్త భారత్ వచ్చింది.

ఇండియా : జాతి, పౌరులు
కొత్త ఇండియా : రాజు, ప్రజలు

ప్రధాని పార్లమెంట్‌కు జవాబుదారే కానీ, దాని అధినేత కాదు. ప్రభుత్వాలు, ప్రధాన మంత్రులు, మంత్రులు వస్తారు.. వెళ్తారు...' అని పేర్కొన్నారు.



పార్లమెంట్ నూతన భవనాన్ని శవపేటికతో పోల్చిన ఆర్‌జెడి

పార్లమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కొద్దిక్షణాల ముందు లాలూ ప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) పార్టీ ట్విట్టర్ ద్వారా స్పందించింది. కొత్త పార్లమెంట్ భవనం శవపేటికలా ఉందంటూ సంచలన ట్వీట్ చేసింది. శవపేటిక, పార్లమెంట్ నూతన భవనం ఫొటోలను ఆదివారం ఉదయం ఆర్‌జెడి తన ట్విట్టర్‌లో పోస్టు చేసింది. దీనికి 'యే క్యా హై (ఇది ఏంటి?)' అంటూ క్యాప్షన్ ఇచ్చింది.

గుజరాత్‌లో 157 పాఠశాలల్లో 'జీరో' ఫలితాలు

అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. రాష్ట్రంలో జరిగిన పదో తరగతి పరీక్షలలో 64.62 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. 157 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి పాస్ కాలేదు. 1084 పాఠశాలలలో 30 శాతం కంటే తక్కువగానే విద్యార్థులు గట్టెక్కారు. 1,65,690 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయగా వారిలో కేవలం 27,446 మంది మాత్రమే పాసయ్యారు. ఉత్తీర్ణతా శాతంలో సూరత్ ప్రథమ స్థానంలో నిలవగా దాహోద్ చివరి స్థానంలో నిలిచింది.

జపాన్‌లో బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణించిన ఎంకె. స్టాలిన్

చెన్నై : అధికారిక పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆదివారం బుల్లెట్ ట్రైన్‌లో ప్రయాణించారు. ఒసాకా నుండి రాజధాని టోక్యోకు 500 కిలోమీటర్లు బుల్లెట్ రైలులో చేరుకున్నారు. ఇటువంటి సేవలు భారతీయ పౌరులకు కూడా అందుబాటులోకి రావాలని ట్వీట్ చేశారు. బుల్లెట్ ట్రైన్‌కి సమానమైన రైల్వే సర్వీస్ డిజైన్‌లోనే కాకుండా వేగం, నాణ్యతతో భారత్‌లో కూడా వినియోగంలోకి రావాలని ట్విటర్‌లో పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రయోజనం పొందాలని, వారి ప్రయాణం సులభతరం కావాలని అన్నారు. తన ప్రయాణానికి సంబంధించిన కొన్ని చిత్రాలను పోస్ట్ చేశారు.

అప్పుల పరిమితిపై కుదిరిన రాజీ

- రిపబ్లికన్లతో బైడెన్ ఒప్పందం
- ప్రస్తుతానికి దివాలా ముప్పు తప్పినట్టే

మెక్‌కార్థీ, జో బైడెన్ (ఫైల్)

వాషింగ్టన్ : అమెరికా అప్పుల పరిమితి పెంపునకు సంబంధించి ఆ దేశాధ్యక్షుడు జో బైడెన్‌కు, ప్రతినిధుల సభలో మెజార్టీగా వున్న రిపబ్లికన్లకు మధ్య రాజీ కుదిరింది. దీంతో దివాలా అంచుకు చేరిన అమెరికా ఊపిరిపీల్చుకుంది. తాజాగా కుదిరిన ఒప్పందం ప్రకారం రెండేళ్లపాటు అప్పుల పరిమితి పెంపు, వ్యయ నియంత్రణపై అమెరికా శ్వేత సౌధానికి, ప్రతినిధుల సభ స్పీకర్ మెక్‌కార్థీకి మధ్య జరిగిన చర్చలు ఫలించాయి. ఇద్దరూ రాజీకి సూత్ర ప్రాయంగా అంగీకరించారు. ఈ మేరకు ఓ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం అమెరికన్ ప్రజలకు చాలా విలువైనదిగా ఆయన పేర్కొన్నారు. అంతకుముందు బైడెన్ ఒక ప్రకటన చేస్తూ. 'ఈ ఒప్పందం రాజీనీ సూచిస్తుంది. ప్రతి ఒక్కరూ తమకు కావాల్సింది పొందలేరు' అని వ్యాఖ్యానించారు. ప్రతినిధుల సభలో రిపబ్లికన్ల ఆధిపత్యం ఉండగా.. సెనెట్‌లో డెమొక్రాట్ల ఆధిక్యం ఉంది. ఈ ఒప్పందం జూన్ 5వ తేదీలోపు కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంది. ఆ తర్వాత బైడెన్ దీనిపై సంతకం చేస్తే అమల్లోకి వస్తుంది. ఒకవేళ అప్పటిలోగా ఈ ఒప్పందం అమల్లోకి రాకపోతే.. జూన్ 5వ తేదీ తర్వాత నుంచి అమెరికా అప్పులు చెల్లించే పరిస్థితిలో ఉండదని ఇప్పటికే అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ హెచ్చరించిన సంగతి తెలిసిందే.అమెరికా అప్పుల భారం 28.5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ఇది ఆ దేశ జిడిపి కన్నా 24 శాతం అధికం.

(మొదటి పేజీ తరువాయి)

రెజ్లర్లపై పైశాచికం

మద్దతుగా నిలిచిన ఐద్వా ఉపాధ్యక్షులు సుభాషిణి అలీ, జగ్మతి సాంగ్వాన్, ఢిల్లీ అధ్యక్షులు మైమూనా మొల్లా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేత అన్నీ రాజా, పిఎంఎస్ నేత పూనమ్ కౌశిక్, మహిళా రైతు నాయకులు చరణ్జీత్ కౌర్ ధురియన్, దేవిందర్ కౌర్ హర్దాస్పురా వందలాది మంది మహిళలతో పాటు కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పార్లమెంట్‌లో గూండా... పతక విజేతల ఈడ్చివేత!

నిప్పులు చెరిగిన రెజ్లర్లు

పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారంటూ వినేష్ పోగట్ నిప్పులు చెరిగారు. పార్లమెంటుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో వినేష్‌ను అడ్డుకొని బస్సులో తరలిస్తుండగా 'కొత్త దేశానికి అభినందనలు' అంటూ ఆమె నినదించారు. భారతీయ క్రీడల చరిత్రలో ఇది విచారకరమైన రోజని సాక్షి మాలిక్ వ్యాఖ్యానించారు. లైంగిక వేధింపులకు పాల్పడిన గూండా బ్రిజ్ భూషణ్ పార్లమెంటులో కూర్చుంటే దేశం కోసం పతకాలు సాధించిన తమను రోడ్లపై ఈడ్చుకెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మన ఛాంపియన్ల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో ప్రపంచమంతా గమనిస్తోంది. దేశానికి పతకాలు తేవడమే నేరమా? అయితే మమ్మల్ని ఉరితీయండి' అని అన్నారు. 'మేము శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తుంటే మహిళలు అని కూడా చూడకుండా ఎలా దౌర్జన్యం చేస్తున్నారో చూడండి. న్యాయం కోసం పోరాడుతుంటే మాకు తీవ్రమైన అన్యాయం చేశారు' అని ఒలింపియన్ బజరంగ్ పునియా విలేకరులతో అన్నారు. రెండు వేల మంది మద్దతుదారులను పోలీసులు నిర్బంధించారని ఆయన చెప్పారు. 'ఏ ప్రభుత్వమైనా దేశ ఛాంపియన్లను ఇలా చూస్తుందా? మేము ఏం నేరం చేశాం?' అని ప్రశ్నించారు.

పోలీసులు చెదరగొడుతుండగా సాక్షి మాలిక్ భర్త, రెజ్లర్ సత్యవ్రత్ కడియన్, మరో రెజ్లర్ జితేందర్ కిన్హాలు 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు రెజ్లర్లను అరెస్ట్ చేసి తొమ్మిది బస్సుల్లో వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బజరంగ్‌ను మయూర్ విహార్ సమీపంలోనూ, సాక్షిని బురారీలోనూ, వినేష్, సంగీతలను కల్కాజీలోనూ పోలీస్ స్టేషన్లలో ఉంచారు. కొందరు ఆందోళనకారులను టిక్రీ సరిహద్దు వైపుకు తరలించారని తెలిసింది. రెజ్లర్ల శిబిరం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు, హోర్డింగులు, టార్పాలిన్ పట్టాలు, వెదురు కర్రలు, తాళ్లు, ఇతర సామగ్రి, రెజ్లర్లు ఉపయోగించిన మంచాలు, పరుపులను సైతం పోలీసులు తొలగించారు. ఆ ప్రదేశాన్ని మొత్తం ఖాళీ చేయించారు.

సరిహద్దుల్లో నిలిపివేత.. వేలాదిమంది అరెస్టు

సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ నిలిపివేశారు. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లతో సహా దేశంలో వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీ వచ్చిన వారిని ఢిల్లీలో ప్రవేశించకుండా సరిహద్దులను మూసివేశారు. రోహ్తక్, హిసార్, భివానీ, జింద్, ఫతేహాబాద్, సంప్లా, పల్వాల్, గుర్గావ్, ఇతర ప్రాంతాల్లో వేలాది మందిని అరెస్టు చేశారు. పంజాబ్‌కు చెందిన మహిళలు, రైతులను నర్వానా సమీపంలోని పంజాబ్, హర్యానా సరిహద్దులో అదుపులోకి తీసుకున్నారు. దీంతో, రైతులు జాతీయ రహదారిని దిగ్బంధించి నిరసన తెలిపారు. అంబాలా నగరంలోని గురుద్వారా మంజీ సాహిబ్ వద్ద వందలాది మందిని అదుపులోకి తీసుకున్నారు. చాలా మంది రైతులను సింఘు సరిహద్దు దగ్గర అదుపులోకి తీసుకుని సోనేపట్‌లోని పోలీస్ స్టేషన్లకు తరలించారు. టిక్రీ సరిహద్దుకు పాదయాత్ర చేస్తున్న సుమారు వెయ్యి మంది రైతులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌కెఎం నాయకుడు రాకేష్ తికాయత్ సహా రెండు వేల మంది రైతులు ఘాజీపూర్ సరిహద్దుకు చేరుకున్నారు. అక్కడ వారిని అడ్డుకున్నారు.

రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌ల వద్ద కూడా రైతులను నిర్బంధించారు. ఎఐకెఎస్ కార్యకర్తలు, రైతులు ఢిల్లీలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు.

పోరాటం కొనసాగుతుంది: రెజ్లర్లు

పోలీసుల చర్యతో ఉద్యమం ముగియదని, జంతర్ మంతర్ వద్ద సత్యాగ్రహం కొనసాగుతుందని, భారత్ నిరంకుశ దేశం కాదని సాక్షి మాలిక్ పేర్కొన్నారు. రైతు సంఘాలు, ఖాప్ నేతలు త్వరలో సమ్మెను ప్రకటించనున్నారు.

మోడీ ప్రభుత్వ చర్య సిగ్గుచేటు: సిపిఎం

రెజ్లర్లు, ఐద్వా నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం సిగ్గుచేటు అని సిపిఐ(ఎం) వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్యం అంటే గొప్ప భవనాలు, ఆడంబర ప్రసంగాలు కాదని, రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, స్వేచ్ఛలను గౌరవించడమని సిపిఎం పేర్కొంది. మోడీ ప్రభుత్వం కొత్త పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించి ఉండవచ్చని, కానీ వీధుల్లో, పోలీసులతో ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తోందని విమర్శించింది.

ఐద్వా ఖండన

మోడీ ప్రభుత్వ అణచివేతను ఐద్వా తీవ్రంగా ఖండించింది. మహిళా సమ్మాన్ పంచాయితీకి వెళ్తున్న వారిని కొత్త పార్లమెంట్ భవనం వద్ద నిర్బంధించడం కేంద్రం నిరంకుశత్వాన్ని వెల్లడిస్తోందని పేర్కొంది. రెజ్లర్లు, కార్యకర్తలందరికీ ఐద్వా సంఘీభావంగా నిలుస్తుందని తెలిపింది.

ప్రజాస్వామ్యానికి దుర్దినం : ఎస్‌కెఎం

న్యాయం చేయాలని కోరిన ప్రముఖ రెజ్లర్లను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే దుర్దినమని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పేర్కొంది. రెజ్లర్లు, రైతులు, మహిళలపై పాశవిక దాడిని ఎస్ కెఎం ఖండించింది. ప్రజాస్వామ్య నిరసనల అణచివేతను ఆపాలని, అరెస్టు చేసిన నిరసనకారులందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేసి శిక్షించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఎస్‌కెఎం హెచ్చరించింది.

రెజ్లర్లకు 1,150 మందికిపైగా ప్రముఖులు మద్దతు

గత 36 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న రెజ్లర్లకు దేశంలోని ప్రముఖులు మద్దతు తెలిపారు. ఈ మేరకు 1,150కిపైగా మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, మాజీ సివిల్ సర్వీస్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు తదితరులు మద్దతు తెలిపారు. వెంటనే బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, అరెస్టు చేసిన రెజ్లర్లను, మహిళా సంఘాల నేతలను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టిఆర్‌కి ప్రధాని మోడీ నివాళి

పార్లమెంట్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి ఎంపిల నివాళి

పార్లమెంట్‌లో ఎన్‌టి రామారావు విగ్రహానికి టిడిపి ఎంపిలు నివాళులర్పించారు. టిడిపి ఎంపిలు కేశినేని నాని, కనకమేడల రవీంద్ర కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్‌టిఆర్ సినిమాల్లో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలను పోషించి, కోట్లాదిమంది మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. మోడీ ప్రతి నెలా నిర్వహించే రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 101వ ఎపిసోడ్‌లో లో ఆదివారం మాట్లాడారు. సినీ, రాజకీయ రంగాల్లో ఎన్‌టిఆర్ చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. గొప్ప నటనా కౌశలంతో ఎన్నో చరిత్రాత్మక పాత్రలకు ఆయన జీవం పోశారని తెలిపారు. రాజకీయాలతోపాటు సినీ రంగంలో గొప్ప ప్రతిభ చూపారన్నారు. బహుముఖ ప్రతిభతో ఆయన సినీ రంగంలో పేరు, ప్రతిష్ఠలు సంపాదించారని తెలిపారు. 300కుపైగా చిత్రాల్లో నటించి అలరించారని తెలిపారు. సావర్కర్ జయంతి సందర్భంగా ఆయనకు కూడా మోడీ నివాళులర్పించారు. 'యువ సంగమ్'లో పాల్గొన్న ఇద్దరు యువకులతో మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడారు. మొదటి విడత యువ సంగమ్‌లో సుమారు 1,200 మంది యువత 22 రాష్ట్రాల్లో పర్యటించారని మోడీ చెప్పారు. వీరంతా తమ జీవితాంతం చిరస్థాయిగా నిలిచిపోయే మధుర జ్ఞాపకాలను సొంతం చేసుకుంటున్నారని తెలిపారు.

సైనికులను కాదు.. వైద్యులను పంపాలి..!

క్యూబా అంతర్జాతీయ వైద్య సంఘీభావానికి 60 ఏళ్లు

క్యూబా : ప్రపంచ దేశాలకు సైనికులను కాదు.. వైద్యులను పంపాలనే ఫిడెల్ కాస్ట్రో సూచన స్ఫూర్తితో సాగుతున్న క్యూబా అంతర్జాతీయ వైద్య సంఘీభావానికి 60 ఏళ్లు పూర్తయ్యాయి. వివిధ దేశాలకు అపన్నసమయంలో క్యూబా తన వైద్య బృందాలను పంపి వైద్య సహాయం అందచేస్తున్న సంగతి తెలిసిందే. 1963 మేలో తొలిసారి అల్జీరియాకు కూబ్యా తన వైద్య బృందాన్ని పంపింది. అయితే అప్పుడు వెళ్లిన క్యూబా వైద్య బృందానికి అంతగా అనుభవం లేదు. ఎప్పుడు ఎలా స్పందించాలో తెలియదని ఆ బృందం వైద్యుల్లో ఒకరైన పాబ్లో రెసిక్ హబీబ్ తెలిపారు. కానీ, ఈ అరవై సంవత్సరాల తరువాత క్యూబా అంతర్జాతీయ వైద్య సంఘీభావం ప్రపంచ ఆరోగ్యంలో ఒక కీలకమైన అంశంగా మారింది. క్యూబా వైద్య సహాయంతో వివిధ దేశాల్లోని లక్షలాది మంది ప్రజలు అంటువ్యాధుల నుంచి విముక్తి పొందారు. 2001 నుంచి ఇప్పటివరకు అమెరికా చేసిన యుద్ధాల వల్ల ప్రత్యక్షంగా 9,06,000 మంది మరణించారు. పరోక్షంగా మరికొన్ని లక్షల మంది చనిపోయారు.. ఇంకా అనేక మంది యుద్ధం దుష్పరిణామాలతో ఇప్పటికీ బాధపడుతున్నారు. మరొకవైపు క్యూబా తన ఆరోగ్య కార్యకర్తలను దేశ దేశాలకు పంపుతున్నది. దాదాపు ఇరవై లక్షలమందికి సురక్షిత కాన్పులయ్యేలా చూసింది. అమెరికాకు, క్యూబాకు ఉన్న తేడా ఇది. ప్రపంచ దేశాలకు సైనికులను కాదు.. వైద్యులను పంపాలనే ఫిడెల్ కాస్ట్రో ఇచ్చిన పిలుపు తీసుకొచ్చిన మార్పు ఇది. మే 2022 నాటికి 6,05,000 మంది క్యూబా ఆరోగ్య కార్యకర్తలు 165 దేశాల్లో సేవలు అందించారు. అంటువ్యాధుల నివారణ, అత్యవసర వైద్య సేవలతో పాటు తుపాను, భూకంప ప్రభావ ప్రాంతాల్లోనూ క్యూబా వైద్య బృందం తన సేవలు అందిస్తోంది.

ప్రచార చిత్రమే : కేరళ స్టోరీపై కమల్

అబుదాబీ : కేరళ స్టోరీ ప్రచార చిత్రమేనని ప్రముఖ సినీ నటుడు కమల్ హసన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వాటికి తాను వ్యతిరేకినని ఆయన చెప్పారు. సినీ అవార్డు స్వీకరించేందుకు అబుదాబీ వచ్చిన కమల్ విలేకరులతో మాట్లాడుతూ వాస్తవంగా జరిగిన సంఘటన ఆధారంగా సినిమా తీశారంటే సరిపోదని అన్నారు. తాను చిన్న చిత్రాలకు అభిమానినని, చిన్న పిల్లలు ఎలా అయితే పెద్ద వారిగా ఎదుగుతారో తాను కూడా అలాగే చిన్న చిత్రాలలో నటించి ఈ స్థాయికి చేరానని తెలిపారు.

Form No. 3
(See Regulation-15 (1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL VISHAKHAPATNAM
Ground & Amp: 1st Floor, 31-31-21, Sai Baba Street, Narayan Bhawan, Dabagardens, Visakhapatnam - 530020
Case No.: O.A. No. 163 OF 2023
Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.
HDFC Bank Limited Guntur Branch
And
M/s. Lakshmi Sai Jinning Mill and others
To,
D2. Sri. Manikonda Kondaiah S/o Sri. Pedamalakondaiah, H.No.24-19-40/1, Workers Colony, D S Nagar, Guntur, -522003.
D3. Sri Manikonda Malyadri S/o Sri Kondaiah, H.No.24-19-40/1, Workers Colony, D S Nagar, Guntur-522003.
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
WHEREAS, **OA/163/2023** was listed before Hon'ble Presiding Officer/Registrar on **31/05/2023.**
WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons/ notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.1,61,72,272.70** (application along with copies of documents etc. annexed).
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; **(ii)** to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; **(iii)** you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties: **(iv)** you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; **(v)** you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **31/05/2023 at 10:30 A.M.** failing the application shall be heard and decided in your absence.
Given under my hand and the seal of this Tribunal on this date: **04 /05/2023.**
Signature of the Officer Authorized to issue summons

FINKURVE FINANCIAL SERVICES LIMITED
Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202, Kamala Mill Compound Lower Parel (W), Mumbai, Maharashtra - 400013
PUBLIC NOTICE
Finkurve Financial Services LTD. through his facilitated partner Augmont Gold Tech Pvt. Ltd. వారి వద్ద తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం తేదీ: **02.06.2023** వ సమయం **10** గంటలకు **Augmont Gold For All, Door No. 26-25-29, 1st Floor, Gnavoluvari Street, Gandhi Nagar, BRTS Junction, Vijayawda - 520003.** వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.
VIJAYWADA : VIJA-42583, VIJA-80126, VIJA-80760, VIJA-73916, VIJA-13400.
For More Details, Contact: Ramprasad Nandipati, Mob. 9246482477
(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

చెస్‌లో వెన్నుతట్టిన పెదనాన్న

నా పేరు ఎల్ కౌశిక్ బాబు. ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నా. లక్కాకుల మాధవి, చిన్న కాశయ్య మా అమ్మానాన్నలు. నాకు చిన్నప్పటి నుంచి చెస్ ఆడటమంటే చాలా ఇష్టం. ఎప్పుడు ఖాళీ సమయం దొరికినా చెస్ బోర్డ్ ముందరేసుకొని ఒక్కన్నే ఆడుకునేవాన్ని. మా స్కూల్లో పీఈటి పీరియడ్‌లో స్నేహితులతో పోటీ పడేవాన్ని. ఎప్పుడూ నేనే గెలిచేవాన్ని. నాలోని ప్రతిభను గుర్తించిన మా పెదనాన్న పెద్దకాశయ్య నంద్యాలలో జరుగుతున్న రాయలసీమ జోన్ లెవెల్ చెస్ పోటీలో పాల్గొన మని ప్రోత్సహించారు. అంత పెద్ద పోటీలో పాల్గొనా లంటే నాకు భయమేసింది. మా పెదనాన్న ధైర్యం చెప్పి, స్వయంగా ఆయనే తీసుకెళ్ళి పోటీలో పాల్గొనేలా చేశాడు. ఆ చెస్ పోటీలో పాల్గొని అండర్ -13 విభాగంలో రాయలసీమ స్థాయిలో 5వ స్థానం సాధించి మెడల్ అందుకున్నాను. తర్వాత 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన నంద్యాల, కర్నూలు జిల్లా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో ఆడాను. 4వ స్థానంలో నిలిచి మెడల్ అందుకోవటం చాలా సంతోషాన్ని కల్గించింది. ఈ పోటీల ద్వారా చెస్ పోటీల్లో నిలబడగలననే నమ్మకం కల్గింది. భవిష్యత్తులో చెస్‌లో మంచి శిక్షణ తీసుకొని గ్రాండ్ మాష్టర్‌గా నిలవటమే నా లక్ష్యం. పిల్లలూ చూశారూగా ! ఒక ప్రోత్సాహం నాలోని ప్రతిభను ఎలా బయటకు తీసిందో. మరి మీలోని ప్రతిభను రాసి వేసవి విడిదిలో పంచుకోండి.

- ఎల్ కౌశిక్ బాబు
8వ తరగతి,
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది (మం), నంద్యాల జిల్లా.

- 4వ తరగతి అమ్మాయిలు, అబ్బాయిలు,
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,
మర్తాడు మెయిన్, గార్లదిన్న మండలం,
అనంతపురం.

బొమ్మరిల్లు

- జి. సాహితి,
6వ తరగతి,
అరుణ హైస్కూలు,
విజయవాడ, కృష్ణా జిల్లా.

- లావణ్య లహరి,
6వ తరగతి,
ఎం.సి.హెచ్.
గాంధీనగర్ హైస్కూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మీ కోసం

ఒక్కోసారి కుక్కర్ మూత గట్టిగా బిగుసుకుని రాదు. అలాంటప్పుడు కుక్కర్‌ను టాప్ వాటర్ కింద పెట్టి నీళ్లు వదలాలి. కొంతసేపటి తరువాత టాప్ కట్టేసి కాసేపు ఆగి మూత తీస్తే సులభంగా వస్తుంది.

జీవన సౌరభం

ఓడిపోతామనే భయంతో ప్రయత్నించకుండా ఉండటం కంటే ప్రయత్నించి ఓడిపోవడం మేలు.

ఎనిమిదేళ్లకు 60 కిలోలు ఎత్తి ...

ఐదేళ్లు అంటే అప్పుడప్పుడే పరిసరాలు అవగాహనలోకి వచ్చే వయసు.. ఆ తరుణంలో బరువులు ఎత్తడం ప్రారంభించింది అర్షియా గోస్వామి. పోటీ ప్రపంచం అంటే ఏంటో కూడా తెలియని పసి వయస్సు. అలాంటిది... ఏకంగా 20, 30, 40, 45 కిలోల బరువులు ఎత్తుతుంటే చుట్టూ ఉన్న జనమే కాదు; ప్రపంచం అంతా ఆశ్చర్యంగా చూసింది. ఆరేళ్ల వయసులోనే 46 కేజీల బరువును ఎత్తి, క్రీడా ప్రపంచం ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు ఏకంగా 60 కిలోలు బరువు ఎత్తి అతి పిన్న వయస్కురాలైన డెడ్‌లిఫ్టర్‌గా ఖ్యాతి తెచ్చుకుంది.

అమ్మాయిలు ఎక్కువ బరువులు మోయలేరు. సుకుమారులు. పెళ్లి అయితే ఈ ఆటలు ఏమీ ఆడరు.. వంటి మూస అభిప్రాయాలు అమ్మాయిలను వెనక్కులాగుతాయి. కానీ, అర్షియా సాహసాన్ని, శక్తినీ చూస్తే ఆ అపోహలు పటాపంచలవుతాయి. హర్యానాలోని పంచకుల ప్రాంతానికి చెందిన అర్షియా 2015 జనవరి 1న జన్మించింది. తండ్రి అవ్నీష్ గోస్వామి ఆమెకు ఐదేళ్ల వయస్సు నుంచే వెయిట్ లిఫ్టింగ్‌లో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. పవర్‌లిఫ్టింగ్ చేస్తూనే ఒక సంవత్సరం తర్వాత టైక్వాండోలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. వెయిట్ లిఫ్టింగ్ కోసం ఆమె చేసే కష్టం అంతా ఇంతా కాదు. యుక్త వయసు వారు చేసే సాధనను ఆమె ఆ చిన్న వయస్సులోనే చేసింది. అయితే మొదట్లో ఎవరూ ఊహించలేదు. ఆమె పెద్ద పెద్ద బరువు ఎత్తగలదని. శిక్షణ తీసుకున్న ఆరు నెలలకే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో మూడో స్థానం దక్కించుకుంది. టోర్నమెంట్‌కి, మరో టోర్నమెంట్‌కి మధ్య ఆమె బరువుల సంఖ్య పెంచాలన్న పట్టుదల బలంగా ఉండేది. ఎన్నో బంగారు పతకాలను సాధించింది. ఆమె అసాధారణ ప్రదర్శన ప్రేక్షకులను, నిపుణులను సైతం ఆశ్చర్యపరిచింది.

అర్షియా అంత బలంగా తయారుకావడానికి రహస్యం ఆమె ఇంట్లో వండిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని మాత్రమే తింటుంది. ఆ వయస్సులో చాక్లెట్ తినాలని ఎవరికైనా ఉంటుంది. కానీ, తను చాక్లెట్ రుచి చూడలేదు. అంత

కఠినంగా శిక్షణ తీసుకుంది. ఆరేళ్ల వయస్సులో, 2021లో 46 కిలోల బరువును ఎత్తిన అతి పిన్న వయస్కురాలు డెడ్‌లిఫ్ట్‌గా రికార్డు సృష్టించింది. ఈ సంఘటనే ఆమె బంగారు జీవితానికి దారివేసింది. ఆమెకు ప్రపంచ వ్యాప్తంగా అభినందనలు వచ్చాయి. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆమె సాధించిన విజయాన్ని గుర్తించింది. ఇప్పుడు అర్షియాకు ఎనిమిదేళ్లు వచ్చాయి. బరువు కూడా అదే స్థాయిలో పెంచింది. 60 కిలోలు ఎత్తి ప్రతిభకు వయస్సుతో సంబంధం లేదని నిరూపించింది.

ఆమె చేస్తున్న కసరత్తులు, వెయిట్ లిఫ్టింగ్‌లను ఆమె తండ్రి వీడియోలు తీసి సోషల్‌మీడియాలో ఉంచగా కోట్లల్లో వ్యూస్ వచ్చాయి. లక్షల మంది ఫాలోవర్స్‌గా మారారు. అర్షియా అంకిత భావానికి హ్యాట్సాఫ్ అంటూ అభినందనలు కురిపిస్తున్నారు. అర్షియా తన వయసు పిల్లలకే కాదు.. తోటి క్రీడాకారులకు, పెద్దలకు కూడా స్ఫూర్తిదాయకం.

చలువనిచ్చే కీర

మండే ఎండలో వేడెక్కే శరీరానికి చలువనిచ్చే కీర తీసుకుంటే ఎన్నో పోషకాలు అందుతాయి. చెడు కొవ్వు తగ్గి బరువు కూడా అదుపులో ఉంటుంది. కీర దోసకాయ వల్ల ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి.

- ఈ కాలంలో చెమట రూపంలో నీరంతా బయటికి వెళ్లి శరీరం శక్తిని కోల్పోతుంది. కీరాలో చర్మ ఆరోగ్యానికి తోడ్పడే పొటాషియం, మెగ్నీషియం, సిలికాన్.. వంటి ఖనిజాలు ఇందులో ఎక్కువ మొత్తంలో ఉన్నాయి. తిరిగి శక్తిని పొందొచ్చు.
- 96 శాతం నీరు ఉండే కీరా తినడం వల్ల శరీరానికి చలువ కూడా చేస్తుంది. కీరను ముక్కలుగా కట్ చేసి తినడంతో పాటు, పెరుగులో ముంచుకుని తినడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఉండే విటమిన్ ఎ, బి, సిలు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.
- ఎండాకాలంలో రక్తపోటు, మధుమేహం ఉన్న వారు కీరను తినడం వల్ల సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది. అలాగే కిడ్నీలో ఏర్పడిన రాళ్లను కరిగించడంలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది.
- వేడి ఎక్కువై కళ్లు మంట పుట్టడం, నీళ్లు కారడం జరుగుతాయి. అప్పుడు చల్లటి కీరదోస ముక్కల్ని కళ్లపై కాసేపు పెట్టుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
- కీర దోసలో ఉండే కొన్ని సమ్మేళనాలు జ్ఞాపకశక్తిని పెంచడంతో పాటు నాడీవ్యవస్థను సురక్షితంగా ఉంచడంలో తోడ్పడుతుంది.
- కీర దోస క్యాన్సర్ కణాలకు వ్యతిరేకంగా పోరాడే కారకాలున్నట్టు కొన్ని పరిశోధనల్లో వెల్లడైంది. అందుకే ఈ రసాన్ని వారంలో ఒకసారైనా తీసుకోవాలి.

కొత్త.. కొత్తగా..

ఇప్పుడు టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ నడుస్తుందా! అంటే అవుననే సమాధానం చెప్పాలి. ప్రస్తుతం మన హీరోలు వరుసగా చేస్తున్న ప్రాజెక్టులన్నీ ఆ తరహాలోనే ఉంటున్నాయి. సినిమా హిట్ పడాలంటే కొత్తదనం కావాల్సిందే.. అందుకే కొత్త జానర్‌లో కథ ఎవరు చెప్పినా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. కొత్త హీరోలు.. కొత్త దర్శక కాంబోల కాలం పోయింది. కథ, కథనం కొత్తగా రాసుకున్న ఆయా దర్శక, రచయితలు వేగంగా ఛాన్స్‌లు కొట్టేస్తున్నారు. పెద్ద హీరోలకు కథలు చెప్పడం, ఓకే అయిపోవడం కూడా వెంటవెంటనే జరిగిపోతోంది. ఇంతకీ మన హీరోలు చేస్తున్న ఆ కొత్త జోనర్ కథలేంటో ఒకసారి చూద్దాం..

బాహుబలి తరువాత ప్రభాస్ ఒప్పుకున్న ప్రాజెక్టులన్నీ భారీగానే ఉన్నాయి. ప్రముఖ దర్శక, నిర్మాతలు, పేరున్న బ్యానర్‌లో భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్నారు. అటువంటి ప్రభాస్ మారుతి దర్శకత్వంలో ఓ సినిమా చేయబోతున్నారు. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ సినిమా కామెడీ, ఎంటర్‌ట్రైనర్, హరర్ జోనర్‌లో ఉంటుందని, ఈ జోనర్ ప్రభాస్ ఇంతవరకు చేయలేదని సమాచారం. వరుస భారీ ప్రాజెక్టుల మధ్య ప్రభాస్ ఒప్పుకున్న చిన్న ప్రాజెక్టు ఇది.

కత్తులు, గొడ్డళ్లు, భారీ డైలాగులు, రక్తపాతం వంటి సినిమాల్లో ఎక్కువగా కనిపించే బాలకృష్ణ వినోదానికి పెద్ద పీట వేసే అనిల్‌రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. ఆ చిత్రంలో శ్రీలీల వంటి యువ నటికి తండ్రి పాత్రలో కూడా నటిస్తున్నారు. కామెడి ప్రధాన ఇతివృత్తంగా, కూతురు సెంటిమెంట్‌తో నడిచే ఈ జోనర్ బాలకృష్ణ కెరియర్‌లోనే కొత్తగా ఉండనుంది.

ప్రేమ కథలు, కామెడీ, మాస్ డైలాగులతో అభిమానులను అలరించే రవితేజ తాజాగా ట్రై చేస్తున్న కొత్త జోనర్ 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం. 70వ దశకంలో పేరుమోసిన స్టూవర్టుపురం గజదొంగ జీవితకథ ఇది. ఇంతవరకు రవితేజ ఇలాంటి బయోపిక్ చిత్రాల్లో నటించలేదు. అలా చూస్తే ఇది రవితేజ కెరియర్‌లో ప్రయోగాత్మక చిత్రమే అవుతుంది. వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఏడాది చివర్లో విడుదలకు సిద్ధంగా ఉంది.



వరుస డిజాస్టర్‌లతో నెట్టుకొస్తున్న నాగార్జున, బెజవాడ ప్రసన్న కుమార్‌తో ఓ సినిమా చేయనున్నారు. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ఉంటుందని టాక్. ఇందులో నాగార్జున కొత్త పాత్రలో, లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. ఈ పాత్ర రెండు కోణాల్లో నడుస్తుందని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. వచ్చే నెల నుండి షూటింగ్ ప్రారంభంకానుంది.

ఇక శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ చేస్తున్న 'గేమ్ ఛేంజర్' చిత్రం పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్‌లో రానుంది. ఈ చిత్రంలో రామ్ చరణ్ తండ్రీ, కొడుకు పాత్రల్లో కనిపించనున్నారు. తండ్రి పాత్ర రామ్ చరణ్ కెరియర్‌లో ఓ ప్రయోగాత్మక పాత్ర అని చెప్పాలి.

మహేష్-రాజమౌళి కాంబోలో రాబోయే చిత్రం గురించి రోజుకో కథ వినిపిస్తోంది. ఈ చిత్రంలో మహేష్ పాత్ర పౌరాణిక తరహాలో ఉండనుందని కొన్ని రోజులు టాక్ నడిచింది. హనుమాన్ పాత్ర అని కూడా వార్తలు వచ్చాయి. అవేమీ కాదు.. టార్జన్ తరహాలో మహేష్ పాత్ర ఉండనుందని చెబుతున్నారు. అడవిలో జరిగే ఇతివృత్తంతో ఈ కథ నడుస్తుందని, మహేష్ ఇంతకుముందెన్నడు చేయని పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

కుటుంబ కథా చిత్రాల్లో ఎక్కువగా కనిపించే వెంకటేష్ కూడా ఈసారి కొత్త ప్రాజెక్టుతో రానున్నాడు. శైలేష్ కొలను దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. 'హిట్', 'హిట్-2' చిత్రాలను రూపొందించిన శైలేష్ నుండి వస్తున్న ఈ ప్రాజెక్టు వెంకటేష్ కెరియర్‌లో 75వ చిత్రంగా రానుంది. ఈ ఏడాది చివర్లో విడుదలతేదీ ప్రకటించారు.

చివరిగా పవన్ కళ్యాణ్, సాయిధరమ్‌తేజ్‌తో సముద్రఖని చేస్తున్న చిత్రం 'బ్రో'లో పవన్ కళ్యాణ్ పాత్రపై ఇంట్రస్టింగ్ బజ్ నడుస్తోంది. ఈ సినిమాలో ఆయన దేవుడుగా, టైమ్‌గా కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ పోస్టర్ కూడా ఆ తరహాలోనే కనిపిస్తోంది. ఇలా మన హీరోలందరూ చేస్తున్న వరుస ప్రాజెక్టులు కొత్త జానర్‌తో ప్రేక్షకులను అలరించనున్నాయి.

ప్రణయ్ సాధించెన్...

తొలి బిడబ్ల్యుఎఫ్ టైటిల్ కైవసం

కౌలాలంపూర్: మలేషియా మాస్టర్స్-2023 పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ చేజిక్కించుకున్నాడు. దీంతో కెరీర్‌లో తొలి బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ టూర్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో ప్రణయ్ 21-19, 13-21, 21-18తో చైనాకు చెందిన వెంగ్ హంగ్ యాంగ్‌పై మూడుసెట్ల హోరాహోరీ పోరులో నెగ్గాడు. ఇరువురు షట్లర్లు ఫైనల్లో తలపడడం ఇదే ప్రథమం. తొలి గేమ్‌లో వెంగ్.. ప్రణయ్‌కు గట్టి పోటీనిచ్చాడు. అర్ధభాగం ముగిసే సమయానికి ప్రణయ్ 10-11తో వెనుకబడ్డాడు. ఆ తర్వాత ప్రణయ్ 12-15 పాయింట్లతో వెనుకబడ్డా.. అద్భుతమైన ఫోర్‌హ్యాండ్ షాట్లతో రాణించి 21-19తో తొలి గేమ్‌ను చేజిక్కించు కున్నాడు. ఇక రెండో గేమ్‌లో ప్రణయ్ వరుసగా పాయింట్లు చేజార్చుకోవడంతో 13-21తో ఆ గేమ్‌ను ప్రత్యర్థికి కోల్పోయాడు. దీంతో తొలి రెండు గేమ్‌లు ముగిసే సరికి ఇరువురు షట్లర్లు ఒక్కో గేమ్‌లో విజయం సాధించడంతో నిర్ణయాత్మక మూడో గేమ్ పోటా పోటీగా సాగింది. మూడో గేమ్‌లో ఇరువురు షట్లర్లు రక్షణాత్మకంగా ఆడడంతో ర్యాలీలు ఎక్కువయ్యాయి. తొలుత 5-7తో వెనుక బడ్డ ప్రణయ్.. ఆ తర్వాత అర్ధభాగం ముగిసే సమయానికి 11-10తో ఒక్క పాయింట్ ఆధిక్యతలో నిలిచాడు. అదే క్రమంలో 14-11, 16-13 పాయింట్లతో ప్రణయ్ ఆధిక్యతలోకి దూసుకెళ్లినా.. చైనా షట్లర్ ప్రణయ్‌పై వరుసగా పాయింట్లు సాధించి ఓ దశలో 18-18పాయింట్లతో సమం చేశాడు. ఆ తర్వాత ప్రణయ్ రెండు ఫోర్ హ్యాండ్ స్మాష్‌లు సంధించి విజేతగా నిలిచాడు. దీంతో ప్రణయ్ ఆనందానికి అవధుల్లేకపోయాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న ప్రణయ్ ఈ టోర్నీ విజేతగా నిలవడంతో 2024 పారిస్ ఒలింపిక్స్‌కు దారి సుగమమం అయినట్లయ్యింది.

అప్పుడు

ఇప్పుడు

స్వాతంత్ర్యానంతరం తొలి పార్లమెంట్‌లో నాటి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్, ప్రధాని నెహ్రూ, అంబేద్కర్ తదితరులు.
నేడు తమిళనాడుకు చెందిన మఠాధిపతులతో పార్లమెంట్ నూతన భవనంలో ప్రధాని మోడీ



ఐపిఎల్ ఫైనల్‌కు వర్షం అడ్డంకి

ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-16 ఫైనల్‌కు వర్షం అడ్డంకిగా నిలిచింది. అహ్మదాబాద్‌లో ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో నరేంద్ర మోడీ అంతర్జాతీయ స్టేడియం పూర్తిగా చిత్తడిగా మారింది. రాత్రి కూడా వర్షం నిలవక పోవడంతో కనీసం టాస్ వేసే అవకాశం కూడా లేకపోయింది. ఎంతకూ వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు అర్ధరాత్రి వేచిచూసి ఫైనల్ మ్యాచ్‌ను సోమవారానికి వాయిదా వేశారు. దీంతో రిజర్వు డే అయిన సోమవారం సీజన్-16 ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సోమవారం కూడా మ్యాచ్ జరగని పక్షంలో సూపర్ ఓవర్‌తో విజేతను నిర్ణయించనున్నారు. అదీ సాధ్యం కాని పక్షంలో ఇరుజట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించనున్నారు.

ఇదే నా చివరి ఐపిఎల్..

హైదరాబాద్: చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు అంబటి రాయుడు ఐపిఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగే ఫైనల్ మ్యాచే తన కెరీర్‌లో చివరిదని ఆదివారం ట్వీట్ చేశాడు. 2010లో ఐపిఎల్‌లో అరంగేట్రం చేసిన రాయుడు గుజరాత్‌పై చెన్నై గెలిస్తే ఆరో టైటిల్‌ను నెగ్గిన జట్టులో సభ్యుడు కానున్నాడు. ముంబయి ఇండియన్స్ తరపున(2013, 2015, 2017).. చెన్నై సూపర్ కింగ్స్ తరపున(2018, 2021) టైటిల్స్ నెగ్గిన జట్టులో రాయుడు ఓ ఆటగాడు. 2018లో చెన్నై ఛాంపియన్‌గా నిలవడంలో రాయుడు కీలకపాత్ర పోషించాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68